


మరోవైపు వెలగని దీపాలిలా..

వెలితిక్కడ.. వెలుగక్కడ..!



స్క్రూబ్రిడ్జి వైపు వెలుగుతున్న వీధి దీపాలు

"చూడు ఒకవైపే చూడు.. రెండోవైపు చూడాలనుకోకు.. అనే సినిమా డైలాగులా ఉంది బెంజి సర్కిల్ పైవంతెనపై వీధిదీపాల తీరు. రామవరప్పాడు వైపు నుంచి స్క్రూబ్రిడ్జి వైపు వీధిదీపాలు వెలుగుతుండగా... స్క్రూబ్రిడ్జి నుంచి రామవరప్పాడు వైపు వెలగకుండా చీకటిగా మారాయి. వాహనాల వెలుతురు తప్ప ఒక్క బల్బు కూడా వెలగడం లేదు.

- ఈనాడు, అమరావతి

ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు ప్రత్యేక కేంద్రాలు


తుళ్లూరు: రాజధాని అమరావతి కోసం సీఆర్డీఏకు భూసమీకరణ పథకంలో భూములు ఇచ్చిన రైతులకు (గతంలో కేటాయించని వారికి) రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపునకు రెండో రోజు గురువారం విజయవాడ సీఆర్డీఏ కార్యాలయంలో లాటరీ నిర్వహించారు. 9 గ్రామాలకు చెందిన 71 మంది రైతులకు 98 నివాస, 72 వాణిజ్య ప్లాట్లు అందజేశారు. రైతులకు త్వరితగతిన ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయడానికి వీలుగా ప్రభుత్వం 9 రిజిస్ట్రేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసిందని సీఆర్డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ తెలిపారు. రిటర్నబుల్ ప్లాట్ల ప్రొవిజనల్ సర్టిఫికెట్లు పొందిన రైతులు సంబంధిత కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని సూచించారు.

మహానగరికి.. మరో మణిహారం

"అమరావతి రైల్వేలైన్‌కు కేంద్రం పచ్చజెండా ఊపడంతో ఇది రాజధానికి మరో మణిహారంగా మారబోతోంది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలు, ప్రధానంగా విజయవాడ, గుంటూరు నగరాలకు వరంగా మారబోతోంది. విజయవాడ రైల్వేస్టేషన్‌పై రద్దీ భారీగా తగ్గించబోతోంది. విజయవాడతో సంబంధం లేకుండా 39 కిలోమీటర్ల దూరంలో మలుపు తిరిగి.. అమరావతి మీదుగా గుంటూరు, అక్కడి నుంచి ఇతర నగరాలకు తేలికగా చేరుకునేందుకు వీలు కలుగుతుంది. ఈ లైన్‌ను ఐకానిక్‌గా మార్చి పర్యాటకులను సైతం ఆకర్షించడంపైనా.. ప్రభుత్వం దృష్టి సారించింది. 57 కిలోమీటర్ల అమరావతి రైల్వే లైన్‌లో.. కృష్ణా నదిపై నిర్మించబోయే 3.2 కి.మీ. ఐకానిక్ వంతెన పర్యాటకులను ఆకర్షించబోతోంది. ఈ రైల్వేలైన్ పర్యావరణహితంగానూ ఉండబోతోంది. ఈ నూతన లైన్‌తో వాహన కాలుష్యాన్ని సైతం పెద్దఎత్తున తగ్గించబోతున్నారు."



దక్షిణ మధ్య రైల్వేలోనే అత్యంత రద్దీ స్టేషన్లలో విజయవాడ ఒకటి. నిత్యం రైల్వేస్టేషన్ మీదుగా 250 రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. సాధారణ రోజుల్లోనే లక్ష మందికి పైగా ప్రయాణికులు వచ్చి వెళ్తుంటారు. సెలవులు, పండగ రోజుల్లో రెండు లక్షల మంది దాటుతుంటారు.



- అమరావతి రైల్వేలైన్‌తో ఈ ప్రాంతానికి మహర్దశ
- ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లావాసులకు వరం
- విజయవాడకు వెలుపల ఎర్రుపాలెం నుంచి ఆరంభం
- గుంటూరుకు ముందు నంబూరు స్టేషన్ వరకు నిర్మాణం

పర్యావరణ హితపథం

ఎర్రుపాలెం-నంబూరు మధ్యలో తొమ్మిది కొత్త స్టేషన్లు రానుండడంతో ఈ ప్రాంతాలన్నింటికీ రైలు కనెక్టివిటీ ఏర్పడుతుంది. తద్వారా వాహన కాలుష్యం విపరీతంగా తగ్గుతుంది. పరిటాల రైల్వేస్టేషన్ వద్ద మల్టీమోడల్ కార్గో టెర్మినల్‌ను నిర్మించనున్నారు. వీటన్నింటికి తోడు కొండపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌కు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, అసలు సంబంధమే లేకుండా ఉండేలా ఈ నూతన లైన్‌ను పర్యావరణహితంగా నిర్మించనున్నారు.

– ఈనాడు, అమరావతి

విజయవాడ రైల్వే స్టేషన్‌లో రైళ్ల రాకపోకల్లో జాప్యం, ప్లాట్‌ఫాంల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ప్రత్యామ్నాయంగా విజయవాడకు చుట్టుపక్కల ఉన్న



కృష్ణా కెనాల్(తాడేపల్లి), గుణదల, రాయనపాడు స్టేషన్లను శాటిలైట్‌గా మార్చాలనే ప్రతిపాదన చాలాకాలంగా ఉంది. తాజాగా అమరావతి లైన్‌కు కూడా ఆమోదముద్ర పడడంతో.. గుంటూరు వైపు వెళ్లే రైళ్లు.. విజయవాడకు రావాల్సిన అవసరం ఉండదు.

శుభపరిణామం.. ప్రగతికి మార్గం



అమరావతి రైల్వే లైన్‌కు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపడం శుభపరిణామం. రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన మన రాజధానిలో నూతన రైలు మార్గం ఏర్పాటు చేయడం గొప్ప విషయం. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రధాని మోదీని సైతం ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్వయంగా కలిసినప్పుడు విజ్ఞప్తి చేశారు. రాజధాని అభివృద్ధిలో ఈ రైలు మార్గం కూడా భాగం కాబోతోంది. విజయవాడ, గుంటూరు మధ్యలో మరో కీలకమైన రైల్వే మార్గంగా ఇది మారుతుంది. బందరు పోర్టుకు కూడా ఈ మార్గం అనుసంధానం అవుతుంది. కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వాలే కొలువు దీరడంతో మనకు ఇలాంటి గొప్ప ప్రాజెక్టులు వస్తున్నాయి. త్వరలో మచిలీపట్నం-రేపల్లె రైల్వే ప్రాజెక్టు కూడా పట్టాలెక్కబోతోంది. ఈ నూతన రైలు మార్గాల రాకతో.. రాష్ట్రంలో ప్రయాణికుల రాకపోకలతోపాటు, సరకు రవాణాకు మార్గం సుగమం అవుతుంది.

– వల్లభనేని బాలశౌరి, బందరు ఎంపీ

పర్యాటకాభివృద్ధికి దోహదపడేలా నిర్మాణం

అమరావతిని దేశంలో ప్రధాన నగరాలు అన్నింటితో కలిపేందుకు ఈ నూతన లైన్ దోహదపడుతుంది. ఈ నూతన లైన్‌ను అనుకున్న లక్ష్యంలోగా పూర్తిచేసేందుకు సిద్ధంగా ఉన్నాం. ఆధునిక పరిజ్ఞానంతో నిర్మించబోయే ఈ లైన్‌లో అనేక విశేషాలుంటాయి. ఐకానిక్ వంతెన కూడా కృష్ణా నదిపై వస్తుండడంతో పర్యాటకాభివృద్ధికి సైతం దోహదపడుతుంది.

– పి.ఈ.ఎడ్విన్, ఏడీఆర్ఎం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, విజయవాడ రైల్వేడివిజన్

రాజధాని అమరావతిలో కీలకం..

– కేశినేని శివనాథ్ (చిన్ని), విజయవాడ ఎంపీ



విజయవాడ రైల్వే జంక్షన్‌కు రోజురోజుకూ రద్దీ పెరుగుతోంది. అమరావతి నూతన మార్గంతో విజయవాడ మీద కూడా ఒత్తిడి తగ్గబోతోంది. ఈ కొత్త మార్గంతో మన రాజధాని అమరావతికి.. దేశంలోని ప్రధాన నగరాలతో అనుసంధానం ఏర్పడనుండడం శుభపరిణామం. భవిష్యత్తులో ఈ రైల్వే లైన్ కీలకంగా మారబోతోంది. హైదరాబాద్, బెంగళూరు వంటి మెట్రో నగరాలను కలిపేలా.. బుల్లెట్ రైళ్లను సైతం ఏర్పాటు చేస్తామని కేంద్రం ఇప్పటికే ప్రకటించింది. ఈ నూతన రైల్వేలైను వాటన్నింటికీ ఆరంభంగా భావిస్తున్నాం.

విజయవాడ బయట నుంచే వెళ్లేలా...

దిల్లీ ప్రధాన లైన్‌లో వచ్చే రైళ్లు విజయవాడతో సంబంధం లేకుండా నేరుగా అమరావతి మీదుగా గుంటూరుకు వెళ్లిపోవచ్చు. విజయవాడకు 39 కిలోమీటర్ల దూరంలో కొండపల్లి రిజర్వ్‌ఫారెస్ట్‌కు వెలుపలి నుంచి సరిగ్గా ఎర్రుపాలెం రైల్వే స్టేషన్ వద్ద నుంచి ఈ లైన్‌ను అమరావతికి అనుసంధానం చేస్తారు. ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు స్టేషన్‌కు కలుపుతారు. నంబూరు నుంచి గుంటూరుకు వెళ్లిపోవచ్చు. విజయవాడ, గుంటూరు మధ్యలో నంబూరు ఉంటుంది. ఈ నూతన లైన్ విజయవాడకు బైపాస్ లాంటిదే. భవిష్యత్తులో ఈ లైన్ అత్యంత ప్రధానమైన మార్గంగా మారబోతోంది. అమరావతి నుంచి ఎర్రుపాలెం వైపు వస్తే దిల్లీ, హైదరాబాద్, అహ్మదాబాద్, ముంబయి వెళ్లిపోవచ్చు. నంబూరు నుంచి గుంటూరు స్టేషన్, అక్కడి నుంచి తెనాలి వస్తే ప్రధాన రైల్వే లైన్‌లో కలిసిపోతుంది. అక్కడినుంచి విశాఖ, చెన్నై, బెంగళూరు, కేరళ వరకూ వెళ్లిపోవచ్చు.


అమ్మ తోడు.. అక్రమం చూడు!

ఈనాడు, అమరావతి

"అక్కడ ఎకరం మార్కెట్ విలువ.. రూ.20 కోట్లు పైమాటే. రిజిస్ట్రేషన్ విలువ రూ.5 కోట్ల వరకు ఉంది. జాతీయ రహదారి పక్కన భూమి. విలువ బాగా పెంచారు. అలాంటివి 3.60 ఎకరాలు ప్రభుత్వ అవసరాలకు సేకరించారు. భూసేకరణ చట్టం మేరకు రెండున్నర రెట్లు పరిహారం ఇస్తారు. అంటే ఎకరానికి రూ.12.50 కోట్లు. 3.60 ఎకరాలకు రూ.55.80 కోట్లు రావాలి. ఈ సొమ్ము దుర్గగుడి అధికారులకు చేదుగా మారింది. పరిహారాన్నీ మరిచి.. భూముల రక్షణనూ విస్మరించిన ఫలితంగా ఇది వివాదంలో పడింది. దాదాపు రూ.55 కోట్ల పరిహారం గద్దలు తన్నుకెళ్లేలా రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే ఈ పరిహారం చెల్లించి ఉండవచ్చని రెవెన్యూ శాఖ అనుమానిస్తోంది. దేవదాయ శాఖ భూముల రక్షణకు జగన్ ఏలుబడిలో చర్యలు లేని వేళ కబ్జాలు పేట్రేగాయి. ప్రసిద్ధ దుర్గగుడి భూములకూ ఎసరెట్టిన దారుణమిది."

ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ దేవస్థానానికి రాష్ట్రంలో.. ఇతర రాష్ట్రాల్లోనూ ఆస్తులు ఉన్నాయి. వాటిలో పొలాలే ఎక్కువ. భూములు.. స్థిర, చర ఆస్తుల లెక్కలు నిర్వహించి.. ఏటా ఆదాయం చూపాలి. దీనిపై ఆలయ అధికారులకు పట్టింపు లేకుంది. దుర్గగుడికి సర్వే నెంబరు 202/1లో 6.25 ఎకరాలు ఉంది. ఇది ఒక రికార్డులో 9 ఎకరాలుగా.. రెవెన్యూ రికార్డుల్లో 8.66 ఎకరాలుగా ఉంది. జలవనరుల శాఖ లెక్కల్లో 6.25 ఎకరాలుగా ఉంది. దాదాపు 9 ఎకరాలను గూడవల్లి గ్రామ రైతు కౌలుకు చేస్తున్నారు. ఏటా ఈయనకు కౌలు తిరిగి పునరుద్ధరించాలి. ఈ భూమి గూడవల్లి సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఉంది. అయితే ఈ పొలాన్ని దుర్గగుడి అధికారులు సేద్యం చేయనీయకుండా కొంత ప్రాంతాన్ని మాత్రమే ఇచ్చారు.

- రూ.కోట్ల విలువైన మాన్యంపై కన్ను..
- బుడమేరు విస్తరణలో దక్కని పరిహారం
- 3.60 ఎకరాలు సేకరించినట్లు నిర్ధారణ
- అయినా పట్టించుకోని దుర్గగుడి అధికారులు



పరిహారం ఏమాయె...?

2012లో బుడమేరు విస్తరణకు ప్రతిపాదించి.. సర్వే నెంబరు 2002/1లో 3.60 ఎకరాలు సేకరిస్తున్నట్లు నోటిఫై చేశారు. ఆ మేరకు దుర్గగుడికి ఆదాయం రావాలి. కొత్త చట్టం ప్రకారం దేవదాయ భూములు ప్రజాహితానికి సేకరించినా పరిహారం ఇవ్వాల్సిందే. జాతీయ రహదారుల సంస్థ కూడా అలాగే చెల్లిస్తోంది. బుడమేరు విస్తరణలోనూ దీనికి పరిహారం అర్హత ఉంది. 2019లో అందరికీ పరిహారం ఇచ్చినా.. వీటికి ఇవ్వలేదు. దుర్గగుడి యాజమాన్య పర్యవేక్షణలో ఉన్నందున పరిహారం గుడికే రావాల్సి ఉన్నా పట్టించుకోలేదు. ప్రస్తుతం ఈ పరిహారం ఎవరు తీసుకున్నారు? ఇచ్చారా లేదా అనేది తేలనేలేదు.

ఇదండీ వీరి చిత్తశుద్ధి...

బుడమేరుకు భూసేకరణ జలవనరుల శాఖ గుడివాడ డ్రెయినేజీ విభాగం ఆధ్వర్యంలో సేకరించారు. 2019లో విజయవాడ సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో 2002/1 సర్వే నెంబరులో 3.60 ఎకరాలు సేకరించినట్లు నమోదు చేశారు. ఇది ప్రభుత్వ భూమి అనీ. . పరిహారం ఇవ్వక్కర్లేదని తేల్చారు. వాస్తవానికి వర్గీకరణలో, నోటిఫికేషన్‌లో ఆలయ భూములనే గుర్తించారు. దీనిని కొందరు 2020లో నాటి దుర్గగుడి ఈవో, అదనపు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా. . అప్పుడు లేఖ రాశారు. 2020లో రాసిన లేఖ రెవెన్యూ శాఖకు 2022లో పంపారంటే.. ఎంత శ్రద్ధనో అర్థం అవుతుంది. లేఖ సంఖ్య సీ1/702/2020. దాని మీద తేదీ 02.12.2022గా ఉంది. ఆ తర్వాత పట్టించుకోలేదు. ప్రస్తుతం డ్రెయినేజీ డివిజన్ గుడివాడ ఈఈ పరిశీలించి కృష్ణా కలెక్టర్‌కు నివేదించారు. సర్వే నెంబరు 202/1లో 3.60 ఎకరాలు సేకరించి బుడమేరు విస్తరణ చేపట్టినట్లు ధ్రువీకరించారు. దేవస్థానానికి పరిహారం ఇవ్వలేదని 2023 జులైలోనే నివేదించారు.

కళ్లెదుటే.. కొల్లగొట్టే యత్నం

ప్రస్తుతం ఈ భూములు ప్రైవేటు పట్టా భూములనీ.. దుర్గగుడి సర్వే నెంబరులో 6.25 ఎకరాలే ఉన్నాయని మిగిలిన పట్టా భూమి ప్రైవేటు వ్యక్తులదని తెరమీదకు తెస్తున్నారు. రెవెన్యూ దస్త్రాల మేరకు 8.66 ఎకరాలనీ, వాటిలో 2.41 ఎకరాలు దుర్గగుడివి కాదని అంటున్నారు. రూ.కోట్ల విలువైన భూమి ప్రైవేటు వ్యక్తులకెళ్లే ప్రమాదం ఉన్నా దుర్గగుడి వారి భూమి తమదే అని ధ్రువీకరించే దస్త్రాలు ఇవ్వట్లేదు.

సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలి



మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టు పేరుతో అధికారులుగా నటిస్తూ నకిలీ ఎస్ఎంఎస్‌లు, వీడియో కాల్స్ ద్వారా భయపెడుతున్నారు. ఇలాంటి వాటిపై ప్రజలను అప్రమత్తం చేయాలని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు పేర్కొన్నారు. మాదకద్రవ్యాలు, మనీ లాండరింగ్ కేసుల్లో ప్రమేయం ఉందంటూ నమ్మించి అమాయకులను మోసం చేస్తున్నారని, అపరాధరుసుం చెల్లించమని బెదిరించి డబ్బులు బదిలీ చేయించుకుంటున్నారని చెప్పారు. ఇలాంటి నేరాల కట్టడికి అందరి సహకారం కావాలని కోరారు. గురువారం తన సమావేశ మందిరంలో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ.. జిల్లాలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. సైబర్ కమాండోలు, సైనికుల ద్వారా ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. నేరం జరిగినపుడు 1930కి ఎలా ఫోన్ చేయాలి? ఏయే ఆధారాలు పోలీసులకు సమర్పించాలి? తదితర అంశాలపై తెలియజేస్తున్నామని వివరించారు. ఖాతా నుంచి డబ్బులు పోయినప్పుడు.. అవి ఏ ఖాతాకు వెళ్లాయో బాధితులకు తెలియజేయాలని కోరారు. మెయిల్ ద్వారా ఏదైనా ఖాతాను స్తంభింపచేసి, డబ్బులు త్వరితగతిన వెనక్కి వస్తే బాధితులు ఆనందపడతారని, దీనికి బ్యాంకర్లు సహకారం అందించాలని కోరారు. అనుమానాస్పద లావాదేవీలు నిలిపివేసి, వెంటనే తమకు సమాచారం అందించాలని, బెదిరింపులకు గురైన ఖాతాదారుడి ఫోన్ స్విచ్ఆఫ్ చేయించి సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయించాలని సూచించారు. ప్రభుత్వ సంస్థలు వీడియో కాల్స్, మేసేజ్‌ల ద్వారా అరెస్టులు చేయవని.. దీనిపై ప్రజలకు మరింతగా అవగాహన కలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్రైం డీసీపీ తిరుమలేశ్వర్‌రెడ్డి, సైబర్ క్రైం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలపాటిని భారీ ఆధిక్యంతో గెలిపించాలి



మాట్లాడుతున్న ఎంపీ శివనాథ్, పక్కన ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ అభ్యర్థి రాజేంద్రప్రసాద్

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను భారీ ఆధిక్యతతో గెలిపించి వైకాపా మూకలకు బుద్ధి చెప్పాలని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకొని తిరువూరులో గురువారం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శాసనమండలిలో తెదేపా సభ్యులు చేసిన పోరాట ఫలితంగానే అప్పటి వైకాపా ప్రభుత్వం పన్నిన మూడు రాజధానుల కుట్ర బిల్లు వీగిపోయిందన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తిరువూరు నియోజకవర్గంలోని 25వేల మందికిపైగా పట్టభద్రులైన ఓటర్లు ఉన్నారని, వారందరితో నూరు శాతం ఓటు నమోదు చేయించే బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలని తెలిపారు. శాసనమండలి సభ్యుడు పి.అశోక్‌బాబు మాట్లాడుతూ శాసనసభతోపాటు శాసనమండలిలో కూడా ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి మెజార్టీ సభ్యులు ఉంటేనే పరిపాలన సజావుగా సాగుతుందని చెప్పారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం మాట్లాడుతూ శాసనసభతోపాటు శాసనమండలిలో కూడా ఎన్డీయే కూటమి అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉండేలా చూసుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ తెదేపా సభ్యత్వ నమోదు, ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదులో తిరువూరు మేటిగా ఉండేలా కృషి చేస్తానన్నారు. పరిశీలకులు శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

శైవక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఈనాడు – అమరావతి

పవిత్ర కార్తిక మాసం వచ్చే నెల 2వ తేదీ నుంచి ప్రారంభం కాబోతోంది. ఇది నవంబరు 30న ముగుస్తుంది. ఈ మాసంలో పరమ శివుడికి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు. కార్తిక సోమవారం రోజు శైవక్షేత్రాలను దర్శిస్తే ఎంతో పుణ్యం లభిస్తుందని భక్తులు నమ్ముతారు. ఈ నేపథ్యంలో భక్తుల రద్దీ దృష్టిలో పెట్టుకుని పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సులు నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. గత ఏడాది ఎక్కువ మంది భక్తులు పంచారామాలు, త్రిలింగ దర్శిని ప్యాకేజీలను వినియోగించుకున్నారు. ఈ ప్యాకేజీలతోపాటు వనభోజనాలు, ఆలయాల సందర్శన కోసం కూడా చాలా మంది వ్యక్తిగతంగా ఆర్టీసీ బస్సులను బుక్ చేసుకున్నారు. దీంతో గతంలో ఎన్నడూ లేని స్థాయిలో ఆదాయం సమకూరింది. ఈ ఏడాది కూడా గత ఏడాది కంటే ఎక్కువ సంఖ్యలో బస్సులను ఏర్పాటు చేస్తున్నారు.



వివిధ డిపోల నుంచి తిరగనున్న ప్రత్యేక సర్వీసులు

డిపో	బస్సులు
జగ్గయ్యపేట	34
తిరువూరు	34
విజయవాడ	150
ఇబ్రహీంపట్నం	25
విద్యాధరపురం	15
ఆటోనగర్	30
గవర్నర్‌పేట-1	22
గవర్నర్‌పేట-2	40
మొత్తం	350

ఈసారి 350 సిద్ధం...

ఎన్టీఆర్ జిల్లా నుంచి పంచారామాలు, శైవ క్షేత్రాలకు ఈ ఏడాది రికార్డు స్థాయిలో 350 ప్రత్యేక బస్సులు వేశారు. ఈసారి డిమాండ్ ఎక్కువగా ఉండొచ్చని గతం కంటే సర్వీసులను పెంచారు. పంచారామాల ప్యాకేజీ కింద ఒకేరోజు అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామ, సామర్లకోటలో క్షేత్రాలను దర్శించుకునే వీలుంది. ఉమ్మడి కర్నూలు జిల్లా యాగంటి, మహానంది, శ్రీశైలం ఆలయాలకు ఒకటిన్నర రోజులో వెళ్లి వచ్చేలా త్రిలింగ దర్శిని ప్యాకేజీని సైతం తయారు చేశారు. వీటితోపాటు శ్రీశైలం, కొండవీడు, అన్నవరం, కర్ణాటకలోని దేవనహళ్లి తదితర ఆలయాలకు వేరుగా బస్సులు నడుపుతున్నారు. డిమాండ్‌ను బట్టి అరుణాచలం, సముద్ర స్నానాలకు కూడా తిప్పనున్నారు.

రికార్డు ఆదాయం

గత ఏడాది కార్తిక మాసంలో స్పెషల్ బస్సులు కిటకిటలాడాయి. జిల్లా నుంచి పలు శైవ క్షేత్రాలకు ఆర్టీసీ అధికారులు 301 బస్సులు నడిపారు. ఎన్నడూ లేనివిధంగా రూ.86.44 లక్షల రాబడి ఆర్టీసీకి వచ్చింది. 87 శాతం ఓఆర్ నమోదైంది. కిలోమీటరుకు రూ.58.72 జమ అయింది. కొవిడ్‌కు ముందు 2019లో వచ్చిన ఆదాయం కంటే ఇది ఎక్కువ. ఈ నేపథ్యంలో ఈ సంవత్సరం ఇంకా ఎక్కువ రద్దీ ఉంటుందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు.

పెరిగిన కృష్ణా వరద ప్రవాహం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కృష్ణా నదిలో ప్రకాశం బ్యారేజీ వద్ద గురువారం వరద ప్రవాహం పెరిగింది. ఉదయం 6 గంటలకు ఎగువ నుంచి 27,685 క్యూసెక్కులు రాగా, సాయంత్రం 6 గంటలకు 35,702 క్యూసెక్కులకు పెరిగింది. 30 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. మిగతా 40 గేట్లు మూసి ఉన్నాయి. సముద్రంలోకి 21,750 క్యూసెక్కులు, పంట కాల్వలకు 13,952 క్యూసెక్కులు విడుదల చేశారు. ఎగువ నుంచి పులిచింతల (వజినేపల్లి) ద్వారా 31,500, మునేరు (కీసర) నుంచి 5,272, పాలేరు నుంచి 357 క్యూసెక్కుల మేర వస్తోంది.

కాల్వలకు 13,952 క్యూసెక్కులు : ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టా పరిధిలోని పంట కాల్వలకు మొత్తం 13,952 క్యూసెక్కులు ఇస్తున్నారు. వీటిలో కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 8,425, కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వకు 5,527 క్యూసెక్కులు ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ నుంచి రైవస్ కాల్వకు 4,188, ఏలూరు కాల్వకు 1,302, కేఈబీ కాల్వకు 1,300, బందరు కాల్వకు 1,705 క్యూసెక్కులు విడుదల చేశారు.

మర్యాద పూర్వక కలయిక


అనురాధకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీపీ రాజశేఖరబాబు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన విశ్రాంత ఐపీఎస్ అధికారిణి అనురాధను పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. మహాత్మా గాంధీ రోడ్డులోని ఏపీపీఎస్సీ కార్యాలయంలో కలిసి పుష్ప గుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

వైద్యఆరోగ్య శాఖ కార్యక్రమాలపై ఆరా


శిక్షణ కలెక్టర్ శుభమ్‌కు వివరిస్తున్న సుహాసిని

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయాన్ని శిక్షణ కలెక్టర్ శుభమ్ నొఖ్వాల్ గురువారం సందర్శించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పథకాల అమలు, వివిధ విభాగాలు ఏర్పాటు, పని విధానం, లక్ష్యాలు తదితర అంశాల గురించి డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని వివరించారు. డీఎల్‌టీవో డాక్టర్ జె.ఉషారాణి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అమృత, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఇందుమతి, రాష్ట్రీయ బాలస్వస్థ కార్యక్రమం అధికారి డాక్టర్ మాధవీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు.. జిల్లాలోని ఆరోగ్య శాఖ పరిధిలోని అధికారులు, గ్రామీణ, పట్టణ ప్రాంతాల వైద్యాధికారులతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సుహాసిని జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు నియంత్రణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లబ్బీపేట పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని సీవీఆర్ ఉన్నత పాఠశాల, పటమట లంక ఉన్నత పాఠశాల, బిషప్ అజరయ్య బాలికోన్నత పాఠశాలలను డీఎంహెచ్‌వో సుహాసిని సందర్శించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 131, 140, 151 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 540 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

చక్రబంధం... ఇదిగో వ్యూహం!

ప్రతి రోజూ సాయంత్రం వేళ.. బెంజిసర్కిల్ ట్రాఫిక్ పాయింట్లలో వాహనాలు బారులు తీరతాయి. రోడ్డు దాటేందుకు కనీసం రెండు సార్లు ఆగాల్సిందే.

- మహానాడు కూడలిలో పగలు సిగ్నల్ పాయింట్ దాటాలంటే కనీసం 10 నిమిషాలు పడుతుంది. సాయంత్రం నుంచి రద్దీ మరింత పెరుగుతుంది. ఎప్పుడు కదులుతామో చెప్పలేని పరిస్థితి.
- రామవరప్పాడు రింగ్ వద్ద ఇరుకైన రోడ్డులో యూ టర్న్ తీసుకునే వాహనాలు స్తంభించిపోతాయి.
- పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి బయటకు వచ్చిన ప్రయాణికులు.. పక్కనే ఉన్న లోబ్రిడ్జి వైపు వెళ్లడానికి నడక మార్గమే లేదు. రోడ్డుపై నడుస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

ట్రాఫిక్‌పై అధికారుల ప్రత్యక్ష పరిశీలన

సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు



విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

నగరంలో ప్రధాన కూడళ్లలో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. ఎక్కడెక్కడ ఎలాంటి సమస్యలు ఉన్నాయో ట్రాఫిక్ పోలీసు అధికారులు గుర్తించారు. ఎన్‌హెచ్‌ఏఐ, ఆర్ అండ్ బీ అధికారులు, జాతీయ రహదారుల విభాగం అధికారులతో కలిసి సర్వే చేశారు. కొన్నింటికి పరిష్కారాలు కనుగొన్నారు. వీటిని గురువారం ట్రాఫిక్ ఏడీసీపీ ఎ.వి.ఎల్.ప్రసన్న ఇతర అధికారులు కలిసి విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఎదుట ప్రస్తావించారు. తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

కృష్ణలంకలో జాతీయ రహదారిపై...

కృష్ణలంక వద్ద జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యలు నిత్యకృత్యమవుతున్నాయి. కార్లు.. ఇతర చిన్న వాహనాలు నగరంలోకి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రకాశం బ్యారేజీ వైపు నుంచి మహాత్మా గాంధీ రోడ్డులోకి వెళ్లాల్సిన వాహన చోదకులు మార్గం తెలియక బెంజిసర్కిల్ వరకు వచ్చేస్తున్నారు. అక్కడి నుంచి మహాత్మా గాంధీ రోడ్డులోకి వెళుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు జాతీయ రహదారులపై దిక్సూచిగా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అమెరికన్ ఆసుపత్రి వైపు నుంచి జాతీయ రహదారిలోకి ప్రవేశించే మార్గం ప్రమాదకరంగా ఉంది. అక్కడ ఏం చర్యలు తీసుకుంటే మంచిదో చర్చించారు. వారధి వద్ద జాతీయ రహదారిపై ఉన్న ఐలాండ్ పెద్దగా ఉండటంతో రోడ్డు ఇరుకుగా మారింది. దీనికి ప్రత్యామ్నాయంగా ఐలాండ్ల నిడివి తగ్గించి, రోడ్డు వెడల్పు చేయాలని నిర్ణయించారు. అదే విధంగా స్క్యూబ్రిడ్జి నుంచి బెంజిసర్కిల్ వైపు వచ్చేటపుడు అక్కడ సర్వీసు రోడ్డులోకి కలిసే మార్గం ఇరుకుగా ఉంది. దీన్ని వెడల్పు చేస్తే.. వాహనాలు సర్వీస్‌రోడ్డులోకి వెళ్లి, మహాత్మా గాంధీరోడ్డులోకి ఆగకుండా వెళ్లిపోతాయి. ఫలితంగా బెంజిసర్కిల్‌పై కొంత మేర ట్రాఫిక్ భారం తగ్గుతుంది.

రామవరప్పాడు రింగ్‌లో భయం

రామవరప్పాడు రింగ్ వద్ద నిత్యం ట్రాఫిక్ కష్టాలే. ప్రధానంగా ఏలూరు వైపు వెళ్లే కార్లు, ట్రావెల్ బస్సులు, ఆర్టీసీ బస్సులు జాతీయ రహదారిపై అండర్‌పాస్ ఉన్నప్పటికీ రింగ్ వద్దకు వస్తున్నారు. దీని వెనక మరికొన్ని వాహనాలు నిలిచిపోతున్నాయి. రింగ్‌రోడ్డు వైపు వచ్చి వాహనాలు మైదానం మీదుగా వెళ్తుంటాయి. ఈ ఆగి ఉన్న వాహనాలను దాటడం కష్టమవుతోంది. దీంతో ట్రాఫిక్ నిలిచిపోతోంది. రాత్రి 9 గంటలు దాటితే ఇక గందరగోళమే. విశాఖపట్నం వైపు వెళ్లే ట్రావెల్ బస్సులన్నీ జాతీయ రహదారిపైనే ఆపుతున్నారు. దీని పక్కనే నిలిపిన ప్రైవేటు వాహనాల సర్వీసు రోడ్డుపై ఉండి. అక్కడ నిలిపితే.. ఎవరికీ ఇబ్బంది ఉండదు.

ప్రతిపాదనలు ఇవీ..

● కృష్ణలంక, గవర్నర్‌పేట, గాంధీనగర్, పటమటలో రహదారులపై ఆక్రమణలు తొలగించాలి. ● రామవరప్పాడు రింగ్ వద్ద ఫుట్‌పాత్ వెడల్పు తగ్గించి, రోడ్డు వెడల్పు చేయాలి. ● పటమట బస్టాప్ ఎదురుగా ఉన్న సెంట్రల్ డివైడర్ కటింగ్‌ను మూసివేసి, ఎక్సెల్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేయాలి. ● కనకదుర్గమ్మ వారధి వద్ద ట్రాఫిక్ ఐలాండ్స్ వెడల్పు తగ్గించాలి. ● బెంజిసర్కిల్ వద్ద రామవరప్పాడు వైపు వెళ్లే ఫ్రీ లెఫ్ట్ సర్వీస్ రోడ్డులోకి అనుసంధానించాలి.

సీపీ పర్యవేక్షణ: కనకదుర్గమ్మ వారధి, రామవరప్పాడు, బెంజిసర్కిల్, మహానాడు కూడలి, ప్రకాశం బ్యారేజీ ప్రాంతాల్లో డ్రోన్ ద్వారా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నారు. డ్రోన్ విజువల్స్‌ను సీపీ ఎస్.వి.రాజశేఖరబాబు కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షిస్తున్నారు. గురువారం కనకదుర్గమ్మ వారధిపై చిన్నపాటి ప్రమాదంలో వాహనదారులు గొడవ పడ్డారు. దీంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. డ్రోన్ కెమెరా ద్వారా గుర్తించి.. ట్రాఫిక్ క్లియర్ చేశారు. కారకులైన చోదకులకు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు.

అమలు చేస్తే..

ట్రాఫిక్ సమస్యలపై అధికారులు చేసిన ప్రతిపాదనలు సక్రమంగా అమలు చేస్తే.. నగరంలో ట్రాఫిక్ సమస్య కొంత మేర తగ్గుతుంది. దీనికి ప్రజలు, వాహన చోదకులు సహకారం అందించాల్సి ఉంది. అందరూ కలిసి ముందుకు వెళితేనే రద్దీ సమయంలో ముఖ్యమైన కూడళ్లలో ట్రాఫిక్ కష్టాలు తీరతాయి. ప్రజలకూ ఇబ్బందులు తీరతాయి.

ఆంధ్రా ఆసుపత్రిలో ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు

ఈనాడు, విశాఖపట్నం: యూకేకు చెందిన హీలింగ్ లిటిల్ హార్ట్స్, మహేష్‌బాబు ఫౌండేషన్ సౌజన్యంతో 32వ ఉచిత పిల్లల గుండె శస్త్రచికిత్సల శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆంధ్రా హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పీవీ రామారావు పేర్కొన్నారు. కేజీహెచ్ సమీపంలోని ఆంధ్రా ఆసుపత్రిలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ''ఈ నెల 21 నుంచి 26 వరకు 15 సంక్లిష్ట గుండె శస్త్రచికిత్సలు ఉచితంగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటివరకు 9 మంది చిన్నారులకు శస్త్రచికిత్స పూర్తయ్యింది. విశాఖలో రెండోసారి ఈ శిబిరం నిర్వహిస్తున్నాం. తొమ్మిదేళ్లలో విజయవాడ, విశాఖలోని ఆంధ్ర హాస్పిటల్స్‌లో 4000 గుండె శస్త్రచికిత్సలు జరిగాయి. వాటిలో అధిక శాతం ఎన్టీఆర్ వైద్య సేవ, మహేష్‌బాబు ఫౌండేషన్, ఇతర సంస్థల సహకారంతో ఉచితంగా చేసినవే. ఆంధ్ర హాస్పిటల్స్ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ విక్రమ్ ఆధ్వర్యంలో పీడియాట్రిక్ కార్డియాలజీ, నవజాత శిశువులు, పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ బృందాలు కలసికట్టుగా పనిచేయడంతో ఇది సాధ్యపడింది. రాబోయే రోజుల్లో ప్రతి రెండు లేదా మూడు నెలలకో సారి ఈ శిబిరం నిర్వహిస్తాం' అని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్ర హాస్పిటల్స్ వైద్య నిపుణులు రేవంత్, విక్రమ్, రవీంద్ర దేవ్, సుబ్రహ్మణ్యం, మురళీకృష్ణ, పద్మావతి తదితరులు మాట్లాడారు. యూకేకు చెందిన వైద్య నిపుణులు సిమోన్, స్నిగ్ధ పద్మాళ్వార్, శరన్ దురైరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల పోస్టులు భర్తీ చేయాలి

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ప్రజారోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుబ్బారాయుడు డిమాండ్ చేశారు. గురువారం హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహించిన విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ 12వ మహాసభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 30 ఏళ్లుగా పారిశుద్ధ్య విభాగంలో శాశ్వత ప్రాతిపదికన కార్మికులను తీసుకోలేదని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను పూర్తి స్థాయిలో భర్తీ చేయడం లేదని విమర్శించారు. మార్చి నుంచి ఆప్కాస్‌లో పేర్ల నమోదు ప్రక్రియ నిలిచిపోవడంతో ఉన్న కార్మికులపై పనిభారం పెరిగి తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. వైకాపా ప్రభుత్వం మాదిరిగా కూటమి ప్రభుత్వం కాంట్రాక్ట్ సంస్థల నుంచి కమీషన్లు వసూలు చేసి, కార్మికుల పొట్టగొట్టేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కనీస వేతన చట్టం అమలు కావడం లేదని, హిందూపురంలో 11 నెలలుగా జీతాలు చెల్లించడం లేదని పేర్కొన్నారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ.. కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వరద సమయంలో పని చేసిన వారికి నెల జీతాన్ని బోనస్‌గా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎం.సాంబశివరావు, యూనియన్ నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, రాజా, ఆర్.పిచ్చయ్య, ఎస్.కె.నజీర్, టి.తాతయ్య, లంక దుర్గారావు, కె.ఆర్.ఆంజనేయులు, కె.రమణారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుబ్బారాయుడు. వేదికపై కోటేశ్వరరావు, సాంబశివరావు, నాగేశ్వరరావు తదితరులు

స్త్రీ, పురుష సమానత్వానికి జ్యోత్స్న కృషి మరువలేం


జ్యోత్స్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పుణ్యవతి, రమాదేవి తదితరులు

కృష్ణలంక, న్యూస్‌టుడే: స్త్రీ, పురుష సమానత్వం కోసం జ్యోత్స్న ఎంతో కృషి చేశారని, మన మధ్య లేకపోయినా ఆమె ఆశయాలను కొనసాగిద్దామని వక్తలు పేర్కొన్నారు. తరుణీతరంగాలు, ఎంబీవీకే, అమరావతి బాలోత్సవం, సేఫ్, ఐద్వా, పీవోడబ్ల్యూ, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, జన శిక్షణా సంస్థాన్, భారత మహిళా మండలి తదితర సంస్థలు సంయుక్తంగా గురువారం 'జ్యోత్స్న జ్ఞాపకాలతో' పేరుతో ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాయి. ఐద్వా జాతీయ నాయకురాలు ఎస్.పుణ్యవతి మాట్లాడుతూ జోత్స్న, తాను చిన్ననాటి నుంచి స్నేహితులమని నగరంలోని మాంటిస్సోరి మహిళా కళాశాలలో చదువుకున్నట్లు జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అమరావతి బాలోత్సవ్ కార్యదర్శి ఆర్.కొండలరావు మాట్లాడుతూ అమరావతి బాలోత్సవం ప్రారంభం నుంచి ఆరు ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించడంలో ఆమె కృషి ఎనలేనిదన్నారు. గుండె వైద్య నిపుణులు డాక్టర్ పూర్ణానంద్, సిద్ధార్థ మహిళా కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ టి.విజయలక్ష్మి, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవిలు మాట్లాడుతూ జ్యోత్స్న స్ఫూర్తితో మహిళా చైతన్యంపై నిర్వహించే కార్యక్రమాలతో యువత ముందుకు సాగాలన్నారు. ఆమె చిత్రపటానికి పలువురు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

నేటి నుంచి పశు గణన


గోడ పత్రాలు ఆవిష్కరిస్తున్న నిధి మీనా, హనుమంతరావు తదితరులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో ఈ నెల 25వ తేదీ శుక్రవారం నుంచి పశు గణన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి కలెక్టర్ నిధి మీనా తెలిపారు. నాలుగు నెలల పాటు ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. నగరంలోని జేసీ విడిది కార్యాలయంలో పశు గణన గోడ పత్రాలు, నియమావళి పుస్తకాలను గురువారం ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ.. 21వ జాతీయ పశు గణన ప్రక్రియ కింద ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 20 గ్రామీణ మండలాలతో పాటు, పట్టణ ప్రాంతాల్లోనూ పశు గణన చేపడతామన్నారు. మొత్తం 7,02,900 కుటుంబాలను సర్వే చేసి, వాళ్ల పరిధిలోని గేదెలు, ఆవులు, కోళ్లు, గొర్రెలు, మేకలు తదితర 16 రకాల పశువులు, జీవాల సంఖ్య లెక్కించి, యాప్‌లో నమోదు చేయనున్నట్లు వివరించారు. దీనికోసం 241 మంది పశు గణన కర్తలు, 47 మంది పర్యవేక్షకులను నియమించినట్లు తెలిపారు. ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక గణన కర్తను నియమించినట్టు చెప్పారు. గణనకర్తలకు పాడి రైతులు సహకరించి కచ్చితమైన వివరాలను అందించాలని ఆమె సూచించారు. జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు ఎం.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి క్రీడాజట్ల ఎంపికలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ అండర్-19 ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి క్రీడా జట్ల ఎంపికలు ఈ నెల 27 నుంచి నిర్వహిస్తామని సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి వి.రవికాంత తెలిపారు. బ్లూమింగ్‌డేల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో అండర్-19 బాలబాలికల స్విమ్మింగ్, వచ్చే నెల ఒకటో తేదీన మారిస్ స్టెల్లా కళాశాలలో బాస్కెట్ బాల్ జట్ల ఎంపికలు, మధ్యాహ్నం మొగల్రాజపురంలోని పీబీ సిద్దార్థ కళాశాలలో ఖోఖో, వాలీబాల్ జట్ల ఎంపికలు, వచ్చే నెల 2న మారిస్ స్టెల్లా కళాశాలలో నెట్‌బాల్ బాలబాలికల జట్ల ఎంపికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు సంబంధిత పత్రాలతో హాజరవ్వాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 94401 12455 నంబరుపై సంప్రదించాలన్నారు.

భూసర్వేలో తప్పులు.. రికార్డులు సరిచేస్తాం


మాట్లాడుతున్న జిల్లా సర్వే అధికారి త్రివిక్రమరావు, పక్కన తహసీల్దారు శాంతిలక్ష్మి, అధికారులు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: గత ప్రభుత్వంలో జరిగిన సమగ్ర భూసర్వేలో జరిగిన తప్పిదాలను సరిచేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని జిల్లా సర్వే అధికారి టి.త్రివిక్రమరావు తెలిపారు. మండలంలోని గుమ్మడిదుర్రులో గురువారం నిర్వహించిన గ్రామసభలో మండల అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు, భూయజమానులు రీసర్వేలో వచ్చిన తప్పులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. భూమి సర్వే చేసే సమయంలో రైతులందరినీ పిలవలేదని, ఇష్టానుసారంగా కొలతలు వేశారని, పాత 1బీ అడంగల్‌లో ఉన్న దానికి, కొత్తగా వస్తున్న అడంగల్‌లో భూరికార్డుల్లో వ్యత్యాసం ఉందని రైతులు అధికారులకు వివరించారు. కొత్తగా చేసిన సర్వేను పూర్తిగా రద్దు చేసి పాత రికార్డులనే పునరుద్ధరించాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. దీనిపై సర్వే అధికారి త్రివిక్రమరావు స్పందిస్తూ భూసర్వే చేసిన ప్రాంతాల్లో భూమికి, రికార్డులకు సాంకేతికతను జోడిస్తున్నామని, దీనివల్ల భూయజమాని తన భూమిని ఎక్కడి నుంచైనా చూసుకునే అవకాశం ఉందన్నారు. దీనివల్ల దొంగ రిజిస్ట్రేషన్లు జరిగే అవకాశం లేదని తెలిపారు. గట్టు జరిగినా వెంటనే తెలిసిపోయేలా చేశామన్నారు. గతంలో జరిగిన భూసర్వే వేగంగా చేపట్టడం వల్ల కొన్ని తప్పులు దొర్లినమాట వాస్తవమేనని తెలిపారు. వాటిని గ్రామసభ దృష్టికి తీసుకువస్తే ప్రతి ఒక్కరి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తేడాలు వచ్చిన రైతులు అర్జీలు దాఖలు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డివిజనల్ సర్వే అధికారి స్వామి, తహసీల్దారు శాంతిలక్ష్మి, సర్పంచి నక్కా కమలమ్మ, రైతు నాయకులు పొన్నం బాలాజీ, పొందూరి శ్రీనివాసరావు, పోపూరి రామకోటేశ్వరరావు, నక్కా సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 85005 44088 మైలవరం: 80085 74705

? జాతీయ రహదారి కొండపల్లి చైతన్యనగర్ వద్ద కాలువలపై వేసే సిమెంటు బిళ్లలు పది రోజుల కిందట రహదారిపై పోశారు. రాత్రి వేళ వెలుతురు లేకపోవడంతో ద్విచక్ర వాహనదారులు పడిపోతున్నారు.

✔ఆ ప్రాంతంలో సైడ్ డ్రెయిన్ నిర్మించారు. వాటిపైన వేయడానికి సిమెంటు అచ్చులు పోశారు. గుత్తేదారు సిబ్బంది వాటిని సోమవారం అక్కడి నుంచి తొలగిస్తామని తెలిపారు.
- పవన్, పారిశుద్ధ్య మేస్త్రీ – న్యూస్‌టుడే, కొండపల్లి

స్పందనకు వందనం

★ పట్టణంలోని 3వ వార్డు సచివాలయం పరిధిలో 6వ వార్డులో శాంతినగర్ కోతమిల్లు వీధిలో పిచ్చి మొక్కలు పెరిగాయని స్థానికుడైన ప్రకాశ్ మేమున్నాం.. మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సిబ్బందితో బాగుజేయించారు.

★ 9వ వార్డు సచివాలయం పరిధిలో 16వ వార్డులో కుమ్మరి బజార్‌లో రోడ్డుపై చెత్త ఉందని స్థానికులు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సిబ్బందితో ఊడ్పించారు.

★ 1వ వార్డు సచివాలయం పరిధిలో 1వ వార్డులో కాలనీ రోడ్డులో మురుగు నీరు పారుదల కాల్వలో పూడిక ఉందన్న సమస్యను ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్‌కి తెలుపగా ఆయన స్పందించి సిబ్బందితో పూడిక తీయించారు.

★ 8వ వార్డు సచివాలయం పరిధిలో 14వ ముస్లిం బజార్‌లో కాల్వల్లో మురుగు ఉందని స్థానికుల ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సిబ్బందితో తొలగింపజేశారు.

- న్యూస్‌టుడే, తిరువూరు

గుడికి రూ.50వేలు వితరణ

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలో అయ్యప్ప స్వామి ఆలయానికి సభ్యుడైన యంద్రాతి భాస్కరరావు గురువారం రూ.50వేలు విరాళం అందజేశారని కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాజారావు, కె.సుబ్బారావు తెలిపారు. గుడిలో జరిగిన అన్నప్రసాదంలో 400 మంది అయ్యప్పస్వామి దీక్షాధారులు పాల్గొన్నట్లు తెలిపారు.

ప్రోత్సాహం.. వెల్లివిరిసె ఆనందం

గంపలగూడెం, విస్సన్నపేట, న్యూస్‌టుడే

రాష్ట్రంలో అధికారం చేపట్టిన ఎన్డీయే కూటమి ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు అందించే ప్రోత్సాహాన్ని పునఃప్రారంభించింది. ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ అభ్యసించే విద్యార్థులకు ఈ ఏడాది నుంచి పాఠ్యపుస్తకాలతో పాటు రాత పుస్తకాలు, సంచులు కూడా అందించింది. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, వృత్తి విద్య (గ్రూపుల్లో) ప్రథమ, ద్వితీయ ఇంటర్ విద్యార్థులకు ఇలాంటి ప్రోత్సాహం అందించడంతో వారి ఆనందానికి అవధుల్లేవు.

ఇంటర్ విద్యార్థులకు విద్యా సామగ్రి ఉచితం

నియోజకవర్గంలోని కళాశాలలు	
ప్రభుత్వ జూనియర్	4
గురుకుల	2
హైస్కూల్ ప్లస్	2
కేజీబీవీలు	2
ఆదర్శ పాఠశాల	1
విద్యార్థులు	1,500 (సుమారు)


నాటి తెదేపా హయాంలో..

2014-19 మధ్య తెదేపా అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించారు. 2018-19లో కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కూడా అమలు చేశారు. 2019లో వైకాపా అధికారంలో వచ్చాక ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రద్దు చేసింది. వారికి అందిస్తోన్న ప్రోత్సాహకాలు ఆపేసింది. దీంతో క్రమేణ విద్యార్థుల సంఖ్య తగ్గింది. తాజాగా ఎన్డీయే ప్రభుత్వం పాఠ్య, రాత పుస్తకాలు, సంచులు ఉచితంగా అందించి ప్రోత్సహించారు.



ప్రభుత్వ నిర్ణయం అభినందనీయం

ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు అందిస్తోన్న ప్రోత్సాహం అభినందనీయం. గ్రామీణ ప్రాంతాల్లో ఖరీదైన పాఠ్య, రాత పుస్తకాలు, బ్యాగులు కొనుగోలుకు ఆర్థికంగా ఇబ్బందిపడుతున్న విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యా సామగ్రిని ఉచితంగా అందించడం ఎంతైనా అవసరమే. మా కళాశాలలో కూడా ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత పుస్తకాలు, బ్యాగులను వారికి అందించాం. – జి.అనూరాధ, పెదకొమిర ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్



వసతిగృహాలూ ఏర్పాటు చేయాలి

ప్రభుత్వం ఇంటర్ చదువుతున్న మాకు ఉచితంగా పాఠ్య, రాత పుస్తకాలు, బ్యాగులు అందించడం సంతోషం. వాస్తవంగా ఖరీదైన అవన్నీ బయట కొనాలంటే మా కుటుంబాలకు ఆర్థికంగా భారమే. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఉపయుక్తంగా ఉంది. ఇక గ్రామీణ కళాశాలల్లో అభ్యసించే విద్యార్థులకు వసతి గృహాల సౌకర్యం ఉండాలి. – అల్లూరి నవీన, దేవర కావేరి, ప్రథమ సీఈసీ



ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం అందించండి

ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ చదివే అభ్యసించే విద్యార్థులకు అందిస్తున్న చేయూతకు కృతజ్ఞతలు. ప్రథమ ఇంటర్‌లో పాఠ్య, రాత పుస్తకాలు, బ్యాగు కొనుగోలుకు మా తల్లిదండ్రులు కష్టపడి డబ్బులు ఇచ్చారు. ద్వితీయ ఇంటర్‌లో ప్రభుత్వమే అవన్నీ ఉచితంగా అందించింది. ఇక ఇంటర్ విద్యార్థులకు ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం కూడా అమలు చేయాలని కోరుతున్నాం.
– అనంత శ్యామ్, ఇనపనూరి గోపాలకృష్ణ, ద్వితీయ ఎంపీసీ,

తిరువూరులో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ప్రారంభిస్తాం



రిబ్బను కత్తిరిస్తున్న ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, ఎమ్మెల్సీ అభ్యర్థి రాజేంద్రప్రసాద్

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌ను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉన్నత విద్యను పూర్తి చేసుకున్న వారికి ఉద్యోగాలు ఇచ్చేందుకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. తిరువూరులో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టడీ సర్కిల్‌ను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు, ఎమ్మెల్సీ అభ్యర్థి ఎ.రాజేంద్రప్రసాద్, ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.

నెమలి వేణుగోపాలుని సేవలో ఎంపీ, ఎమ్మెల్యే

దుందిరాలపాడు, నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని దుందిరాలపాడులో తెదేపా వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు గురువారం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు భూమి పూజ చేశారు. తదుపరి ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నెమలి వేణుగోపాలస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ అధికారులు, అర్చకులు వారిని ఆలయ మర్యాదలతో స్వాగతించారు. అధికారిణి సంధ్య స్వామివారి చిత్రపటాలు, ప్రసాదం అందజేశారు.

30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి



సభ్యత్వ నమోదు పత్రాలు అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

మైలవరం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి షేక్ నవాబ్‌జానీ, కోసూరి రాజశేఖర్ కోరారు. సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని పలు పాఠశాలల్లో పర్యటించి, ఉపాధ్యాయులకు సభ్యత్వాలను అందజేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై తమ సంఘం నిరంతర పోరాటం చేస్తుందన్నారు. సంఘం నాయకులు సోలా రాపురాజు, పుల్లారెడ్డి, యూసుఫ్, వెంకటేష్, శ్రీనివాసరావు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాల అందజేత



నియామక పత్రాలు అందిస్తున్న జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ నిధిమీనా

ఎ.కొండూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: జిల్లాలోని గంపలగూడెం, రెడ్డిగూడెం, ఎ.కొండూరు మండలాల్లోని ఆదర్శ పాఠశాలలు (మోడల్‌స్కూల్స్), కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర ఉద్యోగాలకు ఎంపికైన మహిళలకు గురువారం జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ నిధిమీనా విజయవాడలో నియామక పత్రాలు అందజేశారు. సమగ్ర శిక్ష ఏపీసీ జి.మహేశ్వరరావు, డీఈవో యూవీ.సుబ్బారావు, జీసీడీవో కె.శాంతి పాల్గొన్నారు. నియామకాలు పొందిన ఉద్యోగులు వెంటనే విధుల్లో చేరాలని ఆయన తెలిపారు.



పరీక్ష రాస్తున్న విద్యార్థులు



విజేతలతో ప్రిన్సిపల్, కరస్పాండెంట్

విద్యార్థుల ప్రతిభకు పదును

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక వివేకానంద పాఠశాలలో గురువారం ఈనాడు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశాలపై వ్యాసరచన పోటీ పరీక్ష నిర్వహించారు. పోటీల్లో శ్యామల వర్షిత, కె.సామ్రాజ్య పాశ్వాన్, ప్రజాపతి ధృవిలు మొదటి మూడు స్థానాలు సాధించి, బహుమతులు అందుకున్నారు. ప్రిన్సిపల్ ఎం.వి.శ్రీనివాసరావు, కరస్పాండెంట్ పి.రాజారెడ్డి పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

జి.కొండూరు, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న కబడ్డీ పోటీల్లో మండలంలోని కట్టుబడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి శివనాయక్ ప్రతిభచూపి రాష్ట్రస్థాయి అండర్-14 కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికయ్యారు. పీయీటీ మార్త విద్యార్థి ప్రధానోపాధ్యాయిని రాజశ్రీ అభినందించారు.

మైలవరం: రాష్ట్రస్థాయి అండర్ 14, 17 కబడ్డీ పోటీలకు తమ పాఠశాల విద్యార్థినులు ఇద్దరు ఎంపికైనట్లు మండలంలోని పుల్లూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు నారాయణరావు తెలిపారు. అండర్ 17 విభాగంలో కోటిపల్లి స్రవంతి, అండర్ 14 విభాగంలో దుర్గం మధు బుధవారం జగ్గయ్యపేటలో నిర్వహించిన పోటీల్లో ఎంపికయ్యారన్నారు.

కంభంపాడు(ఎ.కొండూరు): మండలంలోని కంభంపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం జి.ఆదిశేషు, పీడీ బి.గోపి గురువారం తెలిపారు. జగ్గయ్యపేట ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభచూపిన తమ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు ఎం.ప్రశాంత్, ఆర్.ద్వారక ఉమశ్రీ అండర్-14 బాలబాలికల విభాగాల్లో ఎంపికైనట్లు తెలిపారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక బైపాస్ ఫీడరులో మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 25న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రమేష్‌బాబు తెలిపారు.

గంపలగూడెం: మండలంలోని రాజవరం, పెనుగొలను, జింకలపాలెం, రాజులపాలెం, చల్లగుండ్లవారిపాలెం, సత్యాలపాడు, మేడూరు, ఆర్లపాడు, తునికిపాడు, దుందిరాలపాడు, చెన్నవరం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్తు లైన్ల ఏర్పాటు నిమిత్తం సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ జగదీష్ తెలిపారు.

ఆలయ వార్షికోత్సవం

ఇబ్రహీంపట్నం(గ్రామీణం): మూలపాడు గ్రామంలోని బాల త్రిపుర సుందరీ దేవి సమేత విరూపక్షేశ్వర స్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అన్నసంతర్పణ నిర్వహించారు.

యూఎన్‌వో దినోత్సవం

విస్సన్నపేట: ఐక్యరాజ్య సమితి (యూఎన్‌వో) దినోత్సవాన్ని గురువారం విస్సన్నపేట శ్రీశ్రీ పాఠశాలలో నిర్వహించారు. ప్రపంచ శాంతి కోసం యూఎన్‌వో ఆవిర్భావం, బాధ్యతలను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. పాఠశాల నిర్వాహకులు రాజేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమానికి కృషి

తిరువూరు, ఎ.కొండూరు: పాడి రైతుల సంక్షేమం కోసం కృష్ణా మిల్క్ యూనియన్ నిరంతరం కృషి చేస్తోందని సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్.ఆంజనేయులు తెలిపారు. ఎ.కొండూరు మండలం పోలిశెట్టిపాడు, తిరువూరు మండలం కాకర్లలో గురువారం పాడి రైతులతో ఆయన సమావేశమయ్యారు. జిల్లా ట్రస్ట్ సభ్యులు పల్నాటి సత్యనారాయణ, పాల శీతల కేంద్రం మేనేజర్ సాంబశివమూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులకు వీరగాథల పోటీలు

ఇబ్రహీంపట్నం(గ్రామీణం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష, జిల్లా విద్యాశాఖ పాఠశాల స్థాయిలో గురువారం నిర్వహించిన వీరగాథల పోటీల్లో భాగంగా కాచవరం పాఠశాల విద్యార్థుల వేషధారణలు అలంకరించారు. స్వాతంత్ర్య పోరాటాలు చేసిన మహనీయుల గురించి విద్యార్థులు వివరించారు. వీటిని ఉపాధ్యాయులు వీర గాధ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి జిల్లా స్థాయి ఎంపిక కమిటీకి పంపించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయికి అక్కడి నుంచి జాతీయస్థాయికి పంపి విజేతలను నిర్ణయిస్తారని పాఠశాల ఉపాధ్యాయుడు ఇర్ఫాన్ పాషా తెలిపారు. కార్యక్రమాన్ని పాఠశాల హెచ్ఎం నాగమల్లేశ్వరి ఉపాధ్యాయురాలు భవానిలు పర్యవేక్షించారు.

లక్ష్యం కోసం శ్రమించాలి

కొండపల్లి: ప్రతి విద్యార్థి భవిష్యత్తుపై లక్ష్యాన్ని ఏర్పరుచుకుని దానిని సాధించేందుకు శ్రమించాలని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ ఏ.కోటిరెడ్డి అన్నారు. కొండపల్లి ఇండస్ట్రీయల్ పార్క్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమాన్ని స్థానిక బాలికల పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి తర్వాత ఏ కోర్సుల్లో చేరితే భవిష్యత్తులో చక్కని ఉపాధి ఉంటుందో విద్యార్థులు గ్రహించాలన్నారు. ఇండస్ట్రీయల్ పార్క్ లయన్స్ అధ్యక్షుడు రఘునాథరెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి



గొల్లపూడిలో ఓటు దరఖాస్తును స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

గొల్లపూడి, న్యూస్‌టుడే: పట్టభద్రుల శాసన మండలి సభ్యుడు ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. గొల్లపూడిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద గురువారం ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఓటు హక్కు నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. తెదేపా నాయకులు పాల్గొన్నారు.



ఓటు నమోదు ఫారాలను అందజేస్తున్న డీపీఆర్‌టీయూ నాయకులు

మైలవరం: ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఓటేసేందుకు పట్టభద్రులు తమ ఓటును నమోదు చేసుకోవాలని డీపీఆర్‌టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కె.కోటేశ్వరరావు, ఆర్వీఎస్ రామకృష్ణారావు సూచించారు. అందులో భాగంగా గురువారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఓటు నమోదు ఫారాలను అందజేశారు. మస్తాన్‌రావు, శ్రీరామ్, యాకుబ్‌మియా, గోవిందమ్మ, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి

తిరువూరు, న్యూస్‌టుడే: దీపావళి సందర్భంగా గ్రామాల్లో తాత్కాలికంగా బాణసంచా విక్రయ దుకాణాలు నిర్వహించే ప్రైవేటు వ్యాపారస్తులు అధికారుల నుంచి ముందస్తుగా అనుమతి తీసుకోవాలని ఆర్డీవో కె.మాధురి వెల్లడించారు. తన కార్యాలయంలో గురువారం రెవెన్యూ డివిజన్‌లోని రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, విద్యుత్తు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. లైసెన్సులు, ముందస్తు అనుమతులు లేకుండా ఎక్కడైనా దుకాణాలు నిర్వహిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సదరు అధికారులకు ఆమె సూచించారు.

పోలీసుల విధులపై అవగాహన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై రామకృష్ణ

విస్సన్నపేట, న్యూస్‌టుడే: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా విస్సన్నపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై జి.రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రక్షకభటుల విధులపై అవగాహన కల్పించారు. ఠాణాలో జరిగిన 'ఓపెన్ హౌస్'లో సదరు విద్యార్థులకు అమరవీరులైన పోలీసుల త్యాగాలను వివరించారు. పాఠశాల నుంచి పోలీస్‌స్టేషన్‌కు ప్రదర్శనగా వచ్చిన విద్యార్థులు పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు.

తప్పులు సరి చేసేందుకే గ్రామసభలు



వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో మాధురి

గంపలగూడెం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వంలో నిర్వహించిన భూముల రీ సర్వేలో ఏమైనా తప్పులు ఉంటే సరి చేసేందుకే ప్రస్తుతం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తిరువూరు ఆర్డీవో కె.మాధురి స్పష్టం చేశారు. గంపలగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో ఆమె పాల్గొని భూ సమస్యలపై రైతుల అందించిన సభలో 50 అర్జీలు స్వీకరించారు. తహసీల్దారు వి.రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని టి.గన్నవరంలో గ్రామసభలో రైతులు 33 అర్జీలను అందజేసినట్లు తహసీల్దార్ జి.బాలకృష్ణారెడ్డి వివరించారు.

జి.కొండూరు: భూ రీసర్వేకు సంబంధించిన సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ హుమయున్‌బేగ్ అన్నారు. మండలంలోని వెల్లటూరు సచివాలయం-2 లో గురువారం నిర్వహించిన గ్రామసభకు ఆయన హాజరై రైతుల నుంచి పలు సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు.

తూర్పుమాధవరం(ఎ.కొండూరు): తూర్పుమాధవరంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో 29 మంది రైతులు అర్జీలు ఇచ్చారని తహసీల్దారు బి.ఆశయ్య తెలిపారు.

ముష్టికుంట్ల(తిరువూరు): ముష్టికుంట్లలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో భూసమస్యలు పరిష్కారం కోరుతూ రైతుల నుంచి 125 అర్జీలు అందాయని తహసీల్దారు కె.లక్ష్మి తెలిపారు. సభలో ఆర్డీవో కె.మాధురి కూడా పాల్గొని రైతుల సమస్యలను తెలుసుకున్నారు.

తెలంగాణ మద్యం పట్టివేత

కనుమూరు(గంపలగూడెం), న్యూస్‌టుడే: కనుమూరులో గురువారం విజయవాడ ఎక్సైజ్ సూపరింటెండెంట్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నిర్వహించిన తనిఖీలో ఆటోలో అక్రమంగా తరలిస్తున్న తెలంగాణకు చెందిన 200 మద్యం సీసాలు పట్టుకున్నారని తిరువూరు ఎక్సైజ్ సీఐ సత్యనారాయణవర్మ తెలిపారు. నిందితుడు షేక్ బాజీవలిని తిరువూరు న్యాయస్థానంలో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారన్నారు. ఈఎస్‌టీఎఫ్ ఎస్సై కె.శేఖర్‌బాబు పాల్గొన్నారు.

సారా విక్రేతలు అరెస్టు

మైలవరం : ఎక్సైజ్ మైలవరం సర్కిల్ పరిధిలోని రెడ్డిగూడెం మండలం అన్నేరావుపేట తండాలో భరోత కనక మహిళ వద్ద 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ జె.శ్రీనివాస్ తెలిపారు. ద్విచక్ర వాహనంపై 8 లీటర్ల సారా తరలిస్తున్న కూనపరాజపర్వకు చెందిన నాగయ్య, చంద్రుపట్ల తండాకు చెందిన దాసులను అరెస్టు చేసి, గురువారం మైలవరం కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండు విధించినట్లు పేర్కొన్నారు.

స్వర్గపురి వాహనం కొనుగోలుకు విరాళం

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు పూర్వ విద్యార్థుల సంఘం (తోసా) ఆధ్వర్యంలో స్థానిక పోతుల చెరువు వద్ద నిర్మించిన స్వర్గపురికి భౌతిక కాయం తరలించేందుకు అవసరమైన వాహనం కొనుగోలుకు పట్టణానికి చెందిన న్యాయవాది, లయన్స్‌క్లబ్ చార్టర్ అధ్యక్షుడు కంచర్ల ముత్యప్రసాద్ గురువారం రూ.లక్ష విరాళం అందజేశారు. దాత తన తండ్రి రాజారావు జ్ఞాపకార్థం ఇచ్చిన వితరణను తల్లి భారతి చేతుల మీదుగా తోసా సభ్యులకు అందించారు.

కోతకు గురయ్యాయ్.. కరుణించండి

గత నెలలో కురిసిన భారీ వర్షాలకు మండలంలో పలు చెరువులకు గండ్లు పండి రోడ్లు దెబ్బతిన్నాయి. చాలా చోట్ల రోడ్ల మార్జిన్లు సైతం కోతకు గురయ్యాయి. ఇంకా సంబంధిత అధికారులు ఆయా రహదారులను బాగు చేయకపోవడంతో వాహనదారులు భయంభయంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. విస్సన్నపేట -విజయవాడ వయా రెడ్డిగూడెం వైపు ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారి, నూజివీడు -గంపలగూడెం మార్గాల్లో పలు చోట్ల కోతకు గురై దారుణంగా ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**



పాతనాగులూరు వద్ద వరదనీటి ప్రవాహానికి కోతకు గురైన ఆర్‌అండ్‌బీ రహదారి

గంజాయి తాగినా..అమ్మినా పీడీ కేసులు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వై.ప్రసాదరావు, సీఐ, ఎస్సై


మైలవరం, న్యూస్‌టుడే: గంజాయి తాగుతూ దొరికినా, అమ్మినట్లు తెలిసినా కఠిన చర్యలు తీసుకుంటామని, పీడీ యాక్టు ప్రకారం కేసులు నమోదు చేస్తామని ఎన్టీఆర్‌జిల్లా మైలవరం ఏసీపీ వై.ప్రసాదరావు హెచ్చరించారు. ఊరి చివరి లేఔట్‌లో గంజాయితో దొరికిన ఏడుగురు నిందితుల వివరాలను గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన మీడియాకు వివరించారు. విశ్వసనీయ సమాచారంతో గురువారం ఉదయం తిరువూరు రోడ్డులోని ఓ ప్లాట్లలో సీఐ చంద్రశేఖర్, ఎస్సై కె.సుధాకర్‌లు వారి సిబ్బందితో దాడి చేయగా.. అక్కడి షెడ్డులో గంజాయితో ఏడుగురు చిక్కగా..వారిని అదుపులోకి తీసుకుని విచారించారు..ఎన్టీఆర్ కమిషనరేట్ పరిధిలో ద్విచక్ర వాహనాలను చోరీ చేసి, ఏజెన్సీ ప్రాంతంలోని కిముడు శంకర్ అనే గంజాయి విక్రేతకు అప్పగించి.. అతడి నుంచి గంజాయి తెచ్చి మైలవరం ప్రాంతంలో విక్రయిస్తున్నట్లు వెల్లడించారన్నారు. దొరికిన వారిలో ఇద్దరు మైనర్లు, స్థానిక పెద హరిజనవాడకు చెందిన వేల్పుల జమలయ్య (జార్జి), అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతపల్లి క్యాంపు ప్రాంతానికి చెందిన గంజాయి విక్రేత కిముడు శంకర్, ఎ.కొండూరు మండలం గొల్లమందలకు చెందిన వీరమళ్ల ప్రేమ్‌కుమార్, దాసుళ్లపాలేనికి చెందిన వింజమూరి సంపత్, దేవునిచెరువుకు చెందిన కేశి సాగర్‌లపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరుస్తున్నట్లు పేర్కొన్నారు. నిందితుల నుంచి 8 ద్విచక్ర వాహనాలతో పాటు 1.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు.

నందిగామ

•నందిగామ •జగ్గయ్యపేట

ప్రతిభాపాటవ పోటీలకు స్పందన


విజేతలతో ప్రధానోపాధ్యాయిని భారతి, ఉపాధ్యాయులు


వ్యాసం రాస్తున్న కాకతీయ అపోలో విద్యార్థులు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ కాకతీయ అపోలో ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభాపాటవ పోటీలకు చక్కని స్పందన లభించింది. 'అంతర్జాల వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. టి.ఉషా(పదో తరగతి), పి.లాస్య, బీఎస్‌ఎల్ తిరుపతమ్మ(ఎనిమిదో తరగతి)లు విజేతలుగా నిలిచారు. వారికి పాఠశాల ఛైర్మన్ కాపా రవీంద్రనాథ్, డైరెక్టర్ భారతి, ప్రిన్సిపల్ అర్జున్‌ప్రసాద్, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, ప్రమోద్‌కుమార్ పట్నాయక్‌లు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.


లోటు బడ్జెట్‌లోనూ అభివృద్ధికి పెద్దపీట

నందిగామ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఆర్థిక సమస్యలున్నా అభివృద్ధి, సంక్షేమానికి సీఎం చంద్రబాబు నాయుడు నిధులు కేటాయిస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. బుధవారం రాత్రి స్థానిక కాకానినగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో కంచికచర్ల మండలానికి చెందిన 19 కుటుంబాలు వైకాపా నుంచి ఎమ్మెల్యే సౌమ్య సమక్షంలో తెదేపాలో చేరాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ దీపావళి నుంచి మహిళలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం.. ఏడాది మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వనున్నట్లు చెప్పారు. కోగంటి బాబు తదితరులు పాల్గొన్నారు.


తెదేపాలో చేరిన వారితో ఎమ్మెల్యే సౌమ్య

దుమ్ముపడుద్ది..

కంచికచర్ల, న్యూస్‌టుడే: గత ఐదేళ్ల వైకాపా నిర్లక్ష్యంతో కంచికచర్ల-జుజ్జూరు రహదారి పూర్తి అధ్వాన స్థితికి చేరింది. కంచికచర్ల బస్టాండు నుంచి జుజ్జూరు రోడ్డులో ఉన్న పెట్రోలు బంకు వరకు భారీ గుంతలతో వాహనదారులకు నిత్యనరకాన్ని చూపిస్తోంది. వర్షం కురిస్తే బురద, ఎండొస్తే దుమ్ముతో స్థానికులు, వాహనదారులు రోజూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎమ్మెల్యే సౌమ్య ఇచ్చిన హామీ మేరకు ఈ రహదారిని ఇప్పటికైనా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


కంచికచర్ల-జుజ్జూరు రహదారిలో పరిస్థితి

యూటీఎఫ్ మండల కార్యవర్గం

వత్సవాయి: వత్సవాయి మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. మండల యూటీఎఫ్ అధ్యక్షుడిగా అబ్బుల శ్రీను, ప్రధాన కార్యదర్శిగా కె. సుబ్రహ్మణ్యేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా యు.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఎస్కే. జానీ, సహాధ్యక్షునిగా ఎం.మణి, కోశాధికారిగా పి.రామకృష్ణ, కార్యదర్శులుగా గోవిందరాజులు, సునీల్‌బాబు, కిరణ్మయి, జ్యోతి, నరసింహారావు, హెప్సి, బాబూరావు ఎన్నికయ్యారు. వీరిని పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

శ్రీశిర్డీసాయి విగ్రహ ప్రతిష్ఠ

వత్సవాయి, న్యూస్‌టుడే: వత్సవాయిలో పునర్నిర్మించిన శ్రీశిర్డీ సాయి ఆలయంలో గురువారం సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. పరశురామకృష్ణాచార్యుల ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గట్టు కృష్ణమూర్తి, సుశీల దంపతులు విగ్రహాన్ని సమకూర్చినట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

పట్టభద్రులంతా ఓటు నమోదు చేసుకోవాలి


దరఖాస్తు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సౌమ్య

నందిగామ, న్యూస్‌టుడే: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులంతా ఓటు నమోదు చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కోరారు. ఓటరుగా నమోదు కోసం స్థానిక గాంధీ సెంటర్‌లో గురువారం తెదేపా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. పలువురు దరఖాస్తులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఆలోచించి మంచి నాయకుడ్ని ఎన్నుకుంటేనే అన్ని విధాల మంచి జరుగుతుందని చెప్పారు. తెదేపా ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ పోటీ చేస్తున్నారన్నారు. పార్టీ నాయకులు వాసిరెడ్డి ప్రసాదు, యేచూరి రామకృష్ణ, కత్తులోజు శ్రీనివాసాచారి, ఉన్నం సాయిచంద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలో అర్జీల స్వీకరణ

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని అంబారుపేటలో రీసర్వేపై గురువారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీరాములు, మండల సర్వేయరు భోజ్యానాయక్ రైతుల నుంచి 8 అర్జీలు స్వీకరించారు. సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందనకు వందనం

- పరిటాల మసీదు సమీపంలో రహదారిపై ఇసుక, కంకర కుప్పలు అడ్డుగా ఉండటంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని గ్రామానికి చెందిన షేక్‌పీరు పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యంకు తెలియజేశారు.. స్పందించిన ఆయన యజమానులతో మాట్లాడి ఇసుక, కంకర కుప్పలు తొలగింపజేశారు.
- కంచికచర్ల ప్రతీక కాలనీలో తాగు నీటి కుళాయి వద్ద మురుగు నీరు చేరి ఇబ్బందిగా ఉందని, కాలనీకి చెందిన జోగేశ్వరావు సమస్యను పంచాయతీ కార్యదర్శి బ్రహ్మారావు దృష్టికి తీసుకెళ్లారు.. స్పందించిన ఆయన సిబ్బందితో కుళాయి చుట్టూ చేరిన మురుగు నీటిని తొలగింపజేశారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా ఏర్పాటు చేశారు.
- గండేపల్లి ప్రధాన రహదారిలో స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద కాలువలో చెత్త పేరుకుపోయి మురుగునీరు నిల్వ ఉండటంతో దుర్గంధం వస్తుందని గ్రామానికి చెందిన విజయ్ పంచాయతీ కార్యదర్శి రత్నాకర్ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆయన కాలువలో చెత్త తొలగించి మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకున్నారు. - న్యూస్‌టుడే, కంచికచర్ల

మునేరు వరద బాధిత రైతులను ఆదుకోవాలి

పెనుగంచిప్రోలు: గత నెలలో భారీవర్షాలకు మునేరు వరద ముంపునకు గురైన బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని జగ్గయ్యపేట నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులతో కలిసి ఆయన గురువారం మునేరు ముంపునకు గురైన వేమవరం, ముచ్చింతాల, అనిగండ్లపాడు గ్రామాల్లో పర్యటించి బాధిత రైతులతో మాట్లాడి జరిగిన నష్టాన్ని తెలుసుకున్నారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఇచ్చిన రూ.10 వేలు అందరికీ దక్కలేదని ఆరోపించారు. పొలాల్లో పేరుకుపోయిన ఇసుక మేటలు తొలగించేందుకు ప్రభుత్వం ఎకరాకు రూ.లక్ష మంజూరు చేయాలని కోరారు. తువ్వ కాలువకు పడిన గండ్లను వెంటనే పూడ్చాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎం.గాంధీ, జడ్పీటీసీ సభ్యులు వూట్ల నాగమణి, ఏసుపోగు దేవమణి తదితరులు పాల్గొన్నారు.

తెల్లబంగారం తెల్లబోయింది

ధర లేక రైతుల దిగులు

నందిగామ, న్యూస్‌టుడే

తెల్లబంగారంగా పిలుచుకునే పత్తి దిగుబడులు రాక, గిట్టుబాటు ధర లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు కనీస ధర లేకపోవడంతో వారు కన్నీటి పర్యంతమవుతున్నారు. కనీసం కూలీలకు ఖర్చులు రాని దుస్థితిలో సాగు సాగించడం గుదిబండగా మారింది.

ఎన్టీఆర్ జిల్లా నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో సుమారు 70 వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. భారీ వర్షాలు వల్ల పూత, పిందె, కాయ దశలో పైర్లు దెబ్బతిన్నాయి. వరుసగా వానలు పడుతుండడం వల్ల పైర్లు తిరిగి కోలుకోవట్లేదు. ఈ పరిస్థితుల్లో పైర్లల్లో పత్తి కూలీలతో తీయిస్తున్నారు. ప్రస్తుతం ఇళ్ల వద్ద క్వింటా రూ.5 వేల నుంచి రూ. ఆరు వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. ఈ ధరకు విక్రయించలేక ఇళ్లల్లో నిల్వ చేయలేక ఇబ్బందిపడుతున్నారు. తొలి విడతల్లో వచ్చిన పంటలో తేమ ఎక్కువగా, నాణ్యత తక్కువగా ఉండడం వల్ల నిల్వ చేయకుండా అమ్ముతుంటారు. తేమ శాతం ఎక్కువగా ఉందని, నాణ్యత లేదనే కారణంతో సరైన ధర ఇవ్వట్లేదు. మిల్లర్లు కొనుగోలు చేయట్లేదు. క్వింటా పత్తి తీసేందుకు కూలీలకే రూ.1500 పైన ఖర్చు అవుతుంది. ఇవి పోను రైతుకు క్వింటాకు రూ. నాలుగు వేలు సైతం రాని దుస్థితి నెలకొంది. పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగిపోయాయి. ఎకరానికి రూ.50 వేలు వరకు పెట్టుబడి, కౌలు రూ.20 వేలు వరకు ఉంది. పైర్లు దెబ్బతినడం వల్ల ఎకరానికి నాలుగైదు క్వింటాళ్లు సైతం వచ్చే పరిస్థితి లేదు. దీనివల్ల పెట్టుబడులు రాకపోగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు.


రైతులు నిల్వ చేసిన పత్తి

సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఎక్కడ?

జిల్లాలో నందిగామ, కంచికచర్ల, జగ్గయ్యపేట, మైలవరంలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. ఇప్పటి వరకు వీటిని ప్రారంభించలేదు. ఈ ఏడాది పత్తికి గిట్టుబాటు ధర క్వింటాకు రూ.7500లుగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ధర ఏమాత్రం గిట్టుబాటు కాని పరిస్థితి ఉంది. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తుంటే బయట మార్కెట్‌లో ధర తగ్గదని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో తెలంగాణ ప్రాంతానికి చెందిన కొందరు మినీవ్యాన్లతో వచ్చి నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లోని గ్రామాల్లో రైతుల వద్ద పత్తి కొనుగోలు చేస్తున్నారు. క్వింటా రూ.ఆరు వేలు లోపే కొనుగోలు చేస్తున్నారు.

హిందీ పండితులకు పునశ్చరణ తరగతులు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం డివిజన్‌లో హిందీ పండితులకు మారిన సిలబస్‌పై పునశ్చరణ తరగతులు నిర్వహించారు. రిసోర్సు పర్సన్లు టీవీ సుబ్రహ్మణ్యం, మాధవి, సతీష్, ఖలీల్ పదో తరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్నాపత్రం రూపొందించే విధానాన్ని వివరించారు. కో-ఆర్డినేటర్ ఆర్.రాంబాబునాయక్, ప్రధానోపాధ్యాయిని పి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సహకారరంగం బలోపేతానికి సూచనలు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: సహకార రంగం బలోపేతానికి తాను రూపొందించిన మార్గదర్శక సూచనలను విజయవాడలోని ఆంధ్ర రాష్ట్ర సహకార భారతి స్వచ్ఛంద సంస్థల ఐక్యవేదికకు అందించినట్లు రిసోర్స్‌పర్సన్ కర్లపాటి శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు అడ్డూరి శ్రీనివాసరావు, కేంద్ర ప్రతినిధి సంజయ్ పచోపర్ తదితరుల బృందానికి నివేదిక అందించామన్నారు.

'పద్మ వ్యాఖ్యలు ఆక్షేపణీయం'

జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: వైకాపాపై వాసిరెడ్డి పద్మ వ్యాఖ్యలు ఆక్షేపణీయమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి తన్నీరు నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం ఆయన నాయకులతో కలిసి జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలుల్లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

పోలీసుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న సీపీ రాజశేఖర్ బాబు

కంచికచర్ల, న్యూస్‌టుడే: సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు నిరంతరం పని చేస్తున్నారని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా గురువారం కంచికచర్ల ఓసీ క్లబ్‌లో నందిగామ ఏసీపీ రవి కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పోలీసుల సంక్షేమానికి అనేక చర్యలు తీసుకుంటుందని అన్నారు. శిబిరంలో పాల్గొన్న వివిధ కళాశాలల విద్యార్థులను అభినందించి వారికి ధ్రువపత్రాలు అందజేశారు. శిబిరంలో 500 మందికి పైగా పాల్గొన్నట్లు అధికారులు తెలిపారు. నందిగామ, నందిగామ గ్రామీణ సీఐలు వైవీఎల్ నాయుడు, బి.చవాన్, కంచికచర్ల, వీరులపాడు ఎస్సైలు బి.రాజు, అనిల్, పోలీసు సిబ్బంది, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

కంచికచర్ల, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమర వీరుల త్యాగాలను ఎన్నటికీ మరువలేమని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు అన్నారు. నందిగామ ఏసీపీ రవి కిరణ్ ఆధ్వర్యంలో కంచికచర్ల ఓసీ క్లబ్‌లో గురువారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన సందర్శించారు. రక్తదాతలను అభినందించారు. కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించినందుకు డివిజన్ సిబ్బందిని అభినందించారు. డీసీపీ మహేశ్వర్ రాజు, డివిజన్ సీఐలు, డివిజన్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పైపులైన్ల లీకులు నెల రోజుల్లో అరికడతాం


సమావేశంలో ఛైర్మన్, వైస్‌ఛైర్మన్

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్న పైపులైన్ల లీకులు, మురుగునీటి సరఫరాను నెలరోజుల్లో పూర్తిగా అరికడతామని డీఈ కలీముల్లా తెలిపారు. గురువారం మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో 'ఈనాడు'లో ప్రచురితమైన పైపులైన్ల లీకుల కథనాన్ని తెదేపా కౌన్సిలర్లు రామలక్ష్మి, నకిరికంటి వెంకట్, గీతారాణి సహా పలువురు లేవనెత్తడంతో కమిషనర్ రామ్మోహన్‌తోపాటు ఇంజినీరింగ్ అధికారులు వివరణ ఇచ్చారు. పైపులైన్ల లీకులను ఇప్పటికే గుర్తించామని, పూర్తిస్థాయిలో అరికట్టేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక చేపట్టినట్లు తెలిపారు. నీటి సరఫరా విషయం ప్రస్తావనకు వచ్చినప్పుడు నెలవారీగా నిర్వహణ భారం రూ.16 లక్షలుగా ఉండగా, వసూలవుతున్న నీటిపన్ను రూ.4లక్షలు మాత్రమే ఉందని అధికారులు వివరించారు. ఉక్కుకళావేదికలో గతంలో తొలగించిన దివంగత కౌన్సిలర్ బాలాజీ దుకాణాన్ని తిరిగి నిర్మించాలని చేసిన ప్రతిపాదనపై వైకాపాకు చెందిన వైస్‌ఛైర్మన్ హఫీజున్నీసా అభ్యంతరం చెప్పారు. దీంతో ఓటింగ్ నిర్వహించి బాలాజీకి దుకాణం నిర్మించాలని తీర్మానించారు. పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ విషయంలో గతంలో ఎదుర్కొన్న విమర్శలను పూర్తిగా అధిగమించాలని కొత్తగా విధుల్లో చేరిన అధికారులకు కౌన్సిల్ సూచనలు చేసింది.

తారుమారైన బలాలతో..: జగ్గయ్యపేట పురపాలకసంఘంలోని మొత్తం 31 మంది కౌన్సిలర్లలో తొలుత ఛైర్మన్ సహా 17 మంది వైకాపా కౌన్సిలర్లు, 14 మంది తెదేపా కౌన్సిలర్లు ఉండేవారు. ఇటీవల జరిగిన రాజకీయ సమీకరణాల్లో ఛైర్మన్ సహా తెదేపా వారి సంఖ్య 19కి చేరడంతో వారి కుర్చీలను పాలకపక్షం వైపు మార్చారు. వైకాపా నుంచి జనసేనలో చేరిన వైస్‌ఛైర్మన్ సహా 10 మందికి మరోవైపు సీట్లు కేటాయించారు. వైకాపాలో మిగిలిన ఇద్దరిలో కేవలం వైస్‌ఛైర్మన్ హఫీజున్నీసా మాత్రమే హాజరయ్యారు. ఈసారి కౌన్సిల్ సమావేశాలకు హాజరైన వివిధ విభాగాల అధికారులు కూడా పూర్తిగా కొత్త వారు కావడం గమనార్హం.

మద్యం వ్యాపారుల సిండికేట్

గొలుసు దుకాణాలకు సరఫరా చేయాలని ఒప్పందం

నందిగామ, న్యూస్‌టుడే

మద్యం వ్యాపారులు సిండికేట్ అయ్యారు. ఈ మేరకు అందరూ అవగాహనకు వచ్చి గ్రామాల్లో గొలుసు దుకాణాలు పెట్టి మద్యం సరఫరా చేయాలని నిర్ణయించుకున్నారు. నందిగామ డివిజన్ పరిధిలోని నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో 33 మద్యం దుకాణాలకు లాటరీలో ఎంపిక చేసిన వారికి లైసెన్స్‌లు జారీ చేశారు. నందిగామ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నందిగామ, పెనుగంచిప్రోలు, చందర్లపాడు మండలాల్లో 16 దుకాణాలు ఏర్పాటు చేశారు. కంచికచర్లల్లో ఐదు, వీరులపాడు రెండు, జగ్గయ్యపేట, వత్సవాయి మండలంలో పది దుకాణాలు ప్రారంభించారు. సిండికేట్‌ల ద్వారా మండలాల్లో గ్రామాల్లో గొలుసు దుకాణాలకు మద్యం సరఫరా చేయనున్నారు.

పెనుగంచిప్రోలులో..

పెనుగంచిప్రోలులో మద్యం వ్యాపారానికి డిమాండ్ ఉండడంతో దుకాణాలు దక్కించుకునేందుకు పెద్దఎత్తున దరఖాస్తులు చేశారు. వీరిలో ఐదు గురికి దుకాణాలు కేటాయించారు. కేవలం ఇద్దరికి మాత్రమే స్థానికులకు దుకాణాలు దక్కగా మిగిలిన మూడు తెలంగాణ వారికి వచ్చాయి. తెలంగాణ వారి వద్ద నుంచి దుకాణం రూ.కోటి ఇచ్చి మరీ స్థానికులు కొనుగోలు చేశారు. పెనుగంచిప్రోలు మండలానికి ఐదు దుకాణాలు కేటాయించారు. వీరంతా తొలుత పోటాపోటీగా పెనుగంచిప్రోలులోనే మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. అనంతరం వ్యాపారుల మధ్య అవగాహన కుదిరింది. లాభార్జనే ధ్యేయంగా అందరూ సిండికేట్‌గా వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు కుదిరిన ఒప్పందంలో పెనుగంచిప్రోలులో ఏర్పాటు చేసిన ఐదు దుకాణాల్లో రెండింటికి గ్రామాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా అనిగండ్లపాడు, నవాబుపేట గ్రామాలకు దుకాణాలు మార్పు చేయనున్నారు. గ్రామాలకు వెళ్లే దుకాణదారులకు అదనంగా ఒక్కొక్కరికి రూ. ఏడు లక్షలు ఇవ్వనున్నట్లు తెలిసింది. దీంతో పాటు అన్ని దుకాణాల్లో రోజూ చేసే మద్యం వ్యాపారం లావాదేవీలను చూసుకోవడం, నెలకోసారి లాభాలు పంచుకునే విధంగా నిర్ణయించారు. గతంలో మద్యం సిండికేట్‌లు నిర్వాహకులు సరైన లెక్కలు చెప్పకుండా ఏళ్ల తరబడి ఉండటంతో ఈసారి జాగ్రత్తలు తీసుకున్నారు.



☛ చందర్లపాడు, కంచికచర్ల, వీరులపాడు మండలాల్లోను వ్యాపారులు సిండికేట్ అయ్యారు. వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి.

నందిగామలో కుదరని అవగాహన

నందిగామ పురపాలక సంఘం పరిధిలో ఆరు దుకాణాలు ఏర్పాటు చేశారు. కేవలం భారత్ టాకీస్ సెంటర్‌లోనే మూడు పెట్టారు. తెలంగాణ వారికి వచ్చిన వాటిని షాపునకు రూ.70 లక్షలు వెచ్చించి కొనుగోలు చేశారు. ఈ పరిస్థితుల్లో వ్యాపారుల మధ్య పోటీ నెలకొంది. ప్రస్తుతం ఎవరికి వారు దుకాణాలు ప్రారంభించి వ్యాపారాలు చేస్తున్నారు. వీరి మధ్య ఇంకా అవగాహన కుదరలేదు.

సీఎం సహాయ నిధితో పేదలకు భరోసా


ముఖ్యమంత్రి సహాయనిధిని అందిస్తున్న తాతయ్య

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని పలువురికి వైద్యఖర్చుల కోసం మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి పత్రాలను గురువారం ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య పంపిణీ చేశారు. అరవికట్ల శారద, ఆటబోయిన వెంకటనర్సమ్మ, వాసు, రామారావు, దొడ్డి చంద్రమ్మ, కోళ్ల సీతారత్నం, షేక్ షఫరూన్, కాసర్ల సతీష్, బి.ఆదిలక్ష్మి, గార్లపాటి రాజ్యలక్ష్మిలకు మంజూరైన మొత్తం రూ. 7 లక్షల విలువైన ఎల్‌ఓసీ పత్రాలను ఆయన పంపిణీ చేశారు.

కంచికచర్ల, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులు కారణంగా పేదవారు ఆరోగ్య పరంగా ఇబ్బందులు పడకూడదని చంద్రబాబు నాయుడు సీఎం సహాయనిధి నుంచి బాధితులకు వెంటనే నిధులు విడుదల చేస్తున్నట్లు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. మోగులూరుకు చెందిన ఎస్.చందన వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.3 లక్షల చెక్కును ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య గురువారం కంచికచర్లలో ఆమెకు అందజేశారు. తెదేపా మండల అధ్యక్షుడు కోగంటి బాబు, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట బాలుర హైస్కూల్లోని మినీ స్టేడియంలో రాష్ట్ర పోటీలకు హాజరయ్యే జిల్లా కబడ్డీ జట్లను ఎంపిక చేశారు. క్రీడోపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, గంటా వెంకటేశ్వరరావుల బృందం ఆధ్వర్యంలో అండర్ 14, అండర్ 17 విభాగాల్లో బాలికలు, బాలర జట్ల ఎంపిక పూర్తి చేసి గురువారం ప్రకటించారు.


ఎంపికైన అండర్ -14 జట్టు

పరిహారం అందించండి


తహసీల్దారు కార్యాలయం ఎదుట చెవిటికల్లు గ్రామస్థుల నిరసన

కంచికచర్ల, న్యూస్‌టుడే : గత నెలలో కురిసిన భారీ వర్షాలు, వరదలకు తమ గ్రామంలోని ఇళ్లు మొత్తం ముంపునకు గురై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ప్రభుత్వం ముంపు బాధితులకు పరిహారం అందించినప్పటికీ, అధికారుల నిర్లక్ష్యంతో సాయం అందలేదంటూ చెవిటికల్లు గ్రామస్థులు స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందించారు. రెవెన్యూ అధికారులు ఎన్యుమరేషన్‌లో నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. భారీ వరదలతో తాము వారం రోజుల పాటు మోకాలిలోతు వరద నీటిలో కష్టాలు పడ్డామని వాపోయారు. పరిహారం విషయం ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యల దృష్టికి తీసుకెళ్లగా, వారు పునః పరిశీలన చేయాలని అధికారులకు సూచనలు చేసినప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండి పడ్డారు. తమకు వెంటనే న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. న్యాయం జరగకుంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. తమకు పరిహారం అందించాలని అధికారులకు వినతి పత్రం అందజేశారు.

ఉచిత సిలిండర్ల పథకంపై హర్షం

జగ్గయ్యపేట గ్రామీణం: దీపావళి రోజు నుంచి మూడు గ్యాస్ సిలిండర్ల ఉచిత పంపిణీ ప్రారంభించేందుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలపడంపై జిల్లా తెదేపా అధ్యక్షుడు నెట్టెం రఘురాం హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ నిర్ణయం తీసుకున్నారన్నారు.

కృష్ణా స్విమ్మర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

జగ్గయ్యపేట: కృష్ణా స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఉపాధ్యాయుడు కమ్మవరపు కరుణాకర్ ఎన్నికయ్యారు. జగ్గయ్యపేటలో గురువారం జరిగిన ఎన్నికలో గౌరవాధ్యక్షులు, సీఐ ఎం.కిషోర్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యదర్శిగా చింతలచెరువు హుస్సేన్, కోశాధికారిగా గునుగు భాస్కర్ ఎన్నికయ్యారు. పూర్వపు అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు నూతన కార్యవర్గాన్ని సత్కరించి అభినందించారు.

ఆయుర్వేద వైద్యంపై అవగాహన

పెనుగంచిప్రోలు: కొణకంచి ఎంపీపీ పాఠశాలలో గురువారం ఆయుర్వేద వైద్య విధానాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ధన్వంతరి జయంతిని పురస్కరించుకొని ఆయుర్వేద వారోత్సవాల్లో భాగంగా వైద్యురాలు వాణి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

ఎర్రుపాలెం: ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్సై కె.వెంకటేశ్ కథనం మేరకు.. కంచికచర్లకు చెందిన వేముల దుర్గారావు(40) ద్విచక్రవాహనంపై మధిర నుంచి కంచికచర్ల వైపు వెళ్తుండగా మీనవోలు గ్రామ సమీపంలో వాహనం అదుపుతప్పి కింద పడటంతో తలకు బలమైన గాయమైంది. 108లో మధిర ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు.

విజయవాడ తూర్పు

ప్రతిభా పాటవ పోటీలకు స్పందన

కృష్ణలంక, న్యూస్‌టుడే: కృష్ణలంక బాలాజీనగర్ మహిత ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీలకు చక్కని స్పందన లభించింది. 'అంతర్జాల వినియోగం వల్ల లాభనష్టాలు.. విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా.. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన పి.మాన్యశ్రీ, ఎ.జయంత్, కె.విదిషలకు పాఠశాల ఎకడమిక్ డీన్ బి.సురేష్ కుమార్, హైస్కూల్ ఇన్‌ఛార్జ్ నరసింహం, ఇన్‌ఛార్జ్ సంతోష్ కుమార్‌లు ధ్రువపత్రాలు, బహుమతులు అందజేశారు.


వ్యాసం రాస్తున్న విద్యార్థులు


విజేతలతో డీన్ సురేష్‌కుమార్, నరసింహం, సంతోష్‌కుమార్‌లు

అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తాం

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: నగరంలో త్వరలోనే వర్షాకాల పనులు మొదలు పెడతామని, అభివృద్ధి, సంక్షేమంలో పరుగులు పెట్టిస్తామని ఎంపీ కేశినేని శివన్నాథ్, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌లు అన్నారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగో డివిజన్ గురునానక్ కాలనీ గురుద్వారా రోడ్డు శంకుస్థాపన పనులు గురువారం నిర్వహించారు. శివన్నాథ్ మాట్లాడుతూ గత ఐదేళ్లలో నియోజకవర్గంలోని రహదార్లను వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు పట్టుబట్టి ఈ నిధులను మంజూరు చేయించి రోడ్డు నిర్మాణం చేయిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ గత ప్రభుత్వం నియోజకవర్గంలో డ్రైనేజీలకు, కాలువల్లో కనీసం పూడిక తీయలేదన్నారు. సైడు కాలువలు, భూగర్భ డ్రైనేజీ పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.200 కోట్లు కేటాయించారన్నారు. కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, మహేంద్రసింగ్ సహానీ, పరమ్ దీప్ సింగ్, కుల్దీప్ కౌర్, మన్మోహన్‌సింగ్, అరవింద్‌సింగ్, పింకీ, కుల్దీప్ సింగ్, రాజామణి, కోడూరు ఆంజనేయ వాసు, అన్నే సాంబశివరావు, రావి కృష్ణారావు, అడపా నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


భూమి పూజలో ఎమ్మెల్యే రామ్మోహన్, ఎంపీ శివన్నాథ్

అసంపూర్తి పనులతో అవస్థలు

బెంజిసర్కిల్(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: ఎనిమిదో డివిజన్ ఆచార్య రంగానగర్‌లో గ్యాస్ పైపులైన్ల మరమ్మతులు కోసం రహదారిని తవ్వి వదిలేయడంతో పార్క్ పక్కన కాలనీలో నివసిస్తున్న సుమారు 30 కుటుంబాలకు అసౌకర్యంగా ఉంది. అసంపూర్తి పనులు నిర్వహించి మమా అనిపించారు. మట్టి గుట్టలతో పాటు వర్షం కురిసినప్పుడు తీవ్ర అవస్థలు పడుతున్నామని నివాసులు వాపోతున్నారు. తీసిన గుంతలను కొన్ని చోట్ల పూడ్చకుండా వదిలేశారు. దీని వల్ల రాత్రి సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీకి వచ్చే ప్రధాన రహదారి దెబ్బతింది. వర్షం కురిసినప్పుడు నీరు నిలిచిపోతోంది. రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతూ కాలనీవాసులు ఇటీవల నగరపాలక పాలక సంస్థ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేయగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకు అధికారులు పరిశీలించలేదు. ఇప్పటికైనా ఈ సమస్యలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


గ్యాస్ లైన్ మరమ్మతులకు తవ్విన గుంత


దెబ్బతిన్న రహదారి

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

విజయవాడ నగరపాలక సంస్థ: నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పోలీసు అధికారులకు సూచించారు. ట్రాఫిక్ పోలీసు అధికారులతో నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆయన గురువారం సమావేశమయ్యారు. ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల శ్రేయస్సు, ఇతర సమస్యల పరిష్కారానికి నగరపాలక సంస్థ పోలీసు అధికారులకు అవసరమైన సహకారం అందిస్తుందని వెల్లడించారు. పలు ప్రాంతాలు, కూడళ్లలోని ట్రాఫిక్ ఇబ్బందులను ట్రాఫిక్ పోలీసులు కమిషనర్ దృష్టికి తెచ్చారు.

అడ్డుకునేవారేరి?


కృష్ణలంక, న్యూస్‌టుడే

ఆకతాయిలకు అడ్డాగా ఖాళీ స్థలాలు
ఆందోళన చెందుతున్న నగర వాసులు

నగర ప్రజల వ్యాహ్యాళి నిమిత్తం సేదతీరాల్సిన ఘాట్ల పరిసరాలు.. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలోని పీఎన్‌బీఎస్, కృష్ణవేణి, పద్మావతి ఘాట్లు, లోబ్రిడ్జి, రైల్వే ట్రాక్ తదితర ప్రాంతాలు ఇందుకు అడ్డాగా తయారయ్యాయి. సాయంత్రం అయితే చాలు గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లు, హిజ్రాల ముసుగులో అసాంఘిక శక్తులు రెచ్చిపోతున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల దరిదాపుల్లోకి వెళ్లాలంటేనే ప్రజలు బెంబేలెత్తే పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ ప్రాంతాల్లో పోలీస్ నిఘా పటిష్ఠ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి

- ఇటీవల రాజీవ్‌గాంధీ హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ సమీపంలోని ఖాళీ స్థలంలో బాలికపై అత్యాచారానికి యత్నించిన ఘటన చోటుచేసుకుంది.
- కృష్ణలంకకు చెందిన ఓ యువకుడు ఇటీవల పీఎన్‌బీఎస్ పరిసరాల నుంచి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా హిజ్రాలు పిలుస్తున్నారని ఆగాడు. వారు అతడిని బస్‌స్టేషన్ పక్కనే ఉన్న ఖాళీ స్థలానికి తీసుకెళ్లి అతడి నుంచి బలవంతంగా రూ.2 వేలు లాక్కొని ఉడాయించినట్లు తెలిసింది.
- నగరానికి ఒక వ్యక్తి కుటుంబంతో సాయంత్రం సమయంలో కృష్ణవేణి ఘాట్ వద్దకు వెళ్లి అక్కడ తాగి పడేసిన మద్యం సీసాలను చూసి ఏవగించుకుని అక్కడి నుంచి వెళ్లిపోయింది.
- గంజాయి, బ్లేడ్ బ్యాచ్ ముఠాలు రాత్రి వేళల్లో కృష్ణవేణి ఘాట్ వద్దకు వచ్చి బహిరంగంగా గంజాయి, మద్యం సేవిస్తుండడంతో సందర్శకులు, వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.


రాజీవ్‌గాంధీ పార్క్ సమీపంలోని కృష్ణవేణి ఘాట్


పరిసర ప్రాంతాల్లో తాగి పడేసిన మద్యం సీసాలు


పీఎన్‌బీఎస్, రైల్వేట్రాక్‌ల మధ్య ఖాళీ స్థలం

అడవిని తలపిస్తున్న ఖాళీ స్థలం

పీఎన్‌బీఎస్‌కు, రైల్వేట్రాక్‌కు మధ్య నున్న ఖాళీ స్థలం పిచ్చిమొక్కలు పెరిగి అడవిని తలపించేలా మారింది. రాత్రిళ్లు పలువురు హిజ్రాలు అటువైపుగా వచ్చిపోయే వారిని తమ చేష్టలతో ఆకర్షిస్తున్నట్లు ప్రజలు చెబుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చేవారు బస్‌స్టేషన్ సమీపంలోని పద్మావతి, కృష్ణవేణి ఘాట్లు, రాజీవ్‌గాంధీ పార్కులకు సేదతీరే నిమిత్తం వెళుతుంటారు. ఈ క్రమంలో రాత్రిళ్లు రైల్వేట్రాక్, రాజీవ్‌గాంధీ పార్క్ పరిసర ప్రాంతాల్లో జనసంచారం తక్కువగా ఉండడంతో అసాంఘిక శక్తులు వాటిని స్థావరాలుగా చేసుకుంటున్నాయి. ఆ ప్రాంతానికి ఒంటరిగా వచ్చిపోయే వారిని బెదిరించి నగదు, చరవాణులను తస్కరించిన సందర్భాలు ఉన్నాయి.

సర్వే సామగ్రి అందించాలని డిమాండ్

కృష్ణలంక, న్యూస్‌టుడే: ఇంద్ర ధనస్సు సర్వేకు సామగ్రి వెంటనే అందించాలని, లేనిపక్షంలో సర్వే నిలుపుదల చేస్తామని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కమల డిమాండ్ చేశారు. గురువారం రాణిగారితోట సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో గురువారం నుంచి నవంబరు 5 వరకు ఇంటింటి సర్వేకు జిల్లా అధికారులు పిలుపునిచ్చారని కానీ అవసరమైన మెటీరియల్ ఇవ్వలేదన్నారు. సర్వే చేయని పక్షంలో షోకాజ్ నోటీసులు ఇస్తామంటూ కింది స్థాయి అధికారులు ఒత్తిడి చేయడం సరి కాదన్నారు. సర్వే మెటీరియల్ అందించేంత వరకు జిల్లాలో ఆశా వర్కర్లు సర్వే చేపట్టరని కమల స్పష్టం చేశారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. జిల్లా నాయకులు పి.శ్రీలక్ష్మి, దయామణి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమని, ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. నగరానికి చెందిన అంతర్జాతీయ చెస్ క్రీడాకారుడు, గ్రాండ్‌మాస్టర్ ముసునూరి రోహిత్ లలిత్‌బాబు గురువారం స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని శాప్ కార్యాలయంలో ఛైర్మన్ రవినాయుడుని మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల థాయ్‌లాండ్‌లో జరిగిన అంతర్జాతీయ ఓపెన్ చెస్ టోర్నీలో లలిత్‌బాబు విజేతగా నిలిచాడు. అతడిని శాప్ ఛైర్మన్ రవినాయుడు సత్కరించారు. లలిత్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో చెస్ క్రీడాకారులను తయారు చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

బాణసంచా దుకాణాలకు దరఖాస్తులు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: దీపావళి సందర్భంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పలుచోట్ల బాణసంచా దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాధరపురం(లేబర్ కాలనీ) క్రీడా ప్రాంగణం, సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య మున్సిపల్ క్రీడా ప్రాంగణ ప్రాంతాల్లో విక్రయ దుకాణాల ఏర్పాటుకు లైన్సు కలిగిన వ్యాపారుల నుంచి మాత్రమే దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ నెల 29 నుంచి 31 వరకు నిర్దేశిత ప్రాంతాల్లో దుకాణాలు నిర్వహించుకునేందుకు సత్యనారాయణపురం సర్కిల్-2లోని ఎస్టేట్ కార్యాలయం నుంచి ఈ నెల 24వ తేదీ నుంచి 28వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు ఆఫీసు పనిచేసే దినాల్లో వ్యాపారులు దరఖాస్తులు పొందడంతో పాటు, తిరిగి దరఖాస్తులు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఆపై దరఖాస్తులు చేసుకున్నవారిని 28వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు దరఖాస్తుదారుల సమక్షంలోనే లాటరీ పద్ధతిన ఎంపికచేసి, దుకాణాలను కేటాయిస్తామని ఆయన వెల్లడించారు.

ప్రణాళికాధికారులకు డివిజన్ల కేటాయింపు!

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగంలో విధులు నిర్వహిస్తూ పలువురు ప్రణాళికాధికారులు తాజాగా బదిలీ కాగా, మరికొందరు అధికారులు బదిలీపై వచ్చి విధుల్లో చేరారు. వీరికి నగరంలోని 64 డివిజన్ల ప్రాంతాల బాధ్యతలను ప్రస్తుతం సర్దుబాటు చేశారు. ఇప్పటికే ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ముగ్గురు అధికారులతో పాటు, కొత్తగా వచ్చిన ముగ్గురు అధికారులకు పలు డివిజన్ల బాధ్యతలు అప్పగించారు. పలువురిని అంతర్గతంగా మార్పుచేసి పలు డివిజన్ల పర్యవేక్షక బాధ్యతలు అప్పగించారు. ఇలా టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ల(టీపీవోలు), టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ల(టీపీఎస్‌లు) ప్రస్తుతం ఆరుగురు ప్రణాళికా విభాగంలో ఉండగా, వీరికి మూడు నియోజకవర్గాల్లోని డివిజన్లను సర్దుబాటు చేశారు. ఈ మేరకు కమిషనర్ ధ్యానచంద్ర గురువారం సాయంత్రం ఆదేశాలు జారీచేశారు.

★ **జి.మురళీగౌడ్ (టీపీవో-1, 2):** 38, 39, 40, 41, 42, 44, 43, 45, 46, 47, 48 డివిజన్లు. ★ **ఎన్.గిరి (టీపీఎస్-3, 4):** 34, 35, 49, 55, 56, 37, 50, 51, 52, 53, 54. ★ **జి.కృష్ణ(టీపీవో-5, 7):** 57, 60, 61, 62, 63, 64, 27, 28, 29, 31, 33. ★ **ఎస్.కె.మతీన్ మోహజీజ్:** (పీటీఎస్-8, 6): 23, 24, 25, 26, 36, 1, 30, 32, 58, 59. ★ **వసీంబేగ్ (టీపీఎస్-9, 11):** 2, 3, 4, 5, 10, 11, 12, 13, 14 ★ **సీహెచ్ రఘునందనరావు (టీపీవో-10, 12):** 6, 7, 8, 9, 19, 15, 16, 17, 18, 20, 21, 22)

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

80085 74652

స్పందనకు పందనం

★ మూడో డివిజన్ విజయలక్ష్మి కాలనీ 1, 2 రోడ్లు, ఒల్గా ఆర్చరీ పక్క వీధుల్లో చెత్త మేటలు వేశాయని స్థానిక నివాసి అశోక్ 'మేమున్నాం... మీకు తోడుగా' ద్వారా శానిటరీ అధికారి ఆంథోనీ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన చెత్త తొలగింపునకు చర్యలు తీసుకున్నారు.

? మూడో డివిజన్ కరెన్సీనగర్ తాతినేని సూర్యనారాయణ వీధిలో మొదట్లో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. - **రవీంద్ర**

✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **-ప్రభాకర్ రావు, ఏఈ**

– న్యూస్‌టుడే, కరెన్సీనగర్

చిత్రకళ ఉపాధ్యాయుడికి డాక్టరేట్


డాక్టరేట్‌ను అందుకుంటున్న లక్ష్మణ్‌బాబు

కృష్ణలంక, న్యూస్‌టుడే: కృష్ణలంక ప్రాంతానికి చెందిన చిత్రకళ ఉపాధ్యాయుడు మండలి లక్ష్మణ్‌బాబుకు అమెరికాకు చెందిన గ్లోబల్ హ్యూమన్ పీస్ విశ్వవిద్యాలయం ఫైన్ ఆర్ట్స్‌లో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రస్తుతం ఆయన గొల్లపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముద్రించే పుస్తకాల్లో పాఠ్యాంశాలకు బొమ్మలు వేయడం, ఆగస్టు 15, రిపబ్లిక్ డే పరేడ్ శకటాల డిజైన్ల నిర్మాణంలో పాల్గొని అధికారుల ప్రశంసలు పొందారు. ఈ నెల 19వ తేదీన పాండిచ్చేరిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ రాష్ట్ర మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ, ప్రజాప్రతినిధులు, విశ్వవిద్యాలయం ప్రతినిధులు, అధికారుల సమక్షంలో డాక్టరేట్‌ను అందుకున్నారు. గొల్లపూడి జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయిని విజయలక్ష్మి, ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు.

హోరా.. హోరీగా 'ఐస్టా' టెన్నిస్ టోర్నీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఐజీఎంసీ స్టేడియం టెన్నిస్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న 'ఐస్టా' ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నీలో పలువురు క్రీడాకారులు హోరా.. హోరీగా తలపడ్డారు. బుధవారం జరిగిన 65+ సింగిల్స్‌లో శ్రీనివాసరెడ్డి ప్రథమ, ఫలచంద్ర ద్వితీయ స్థానాలు కైవసం చేసుకోగా.. డబుల్స్ ఫైనల్స్‌లో శ్రీనివాసరెడ్డి-సన్యాసి జోడీ ప్రథమ, మన్మథరావు-ధనుంజయులు జోడీ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. 70+ సింగిల్స్‌లో సేతు ప్రథమ, రాధాకృష్ణ ద్వితీయ, 70+ డబుల్స్‌లో రాంబాబు-సేతు జోడీ ప్రథమ, రత్ననాయక్-వడివేలు జోడీ ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. 75+ డబుల్స్‌లో రామకృష్ణ-భాస్కర్‌నాయుడు జోడీ ప్రథమ, శేషసాయి-వీఏఎస్ నాయుడు జోడీ ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. 35+ సింగిల్స్‌లో ఈశ్వర్ సాయి ప్రథమ, అశ్విన్ ద్వితీయ స్థానాలు సొంతం చేసుకోగా.. 35+ డబుల్స్‌లో జానకి-ఈశ్వర్ జోడీ, మహేశ్వర్-రాంబాబు జోడీ ఫైనల్‌లో ప్రవేశించాయి. 45+ సింగిల్స్‌లో కేవీ ఎన్ఎల్ మూర్తి, వహీద్‌లు ఫైనల్‌కు చేరుకున్నారు. 55+ సింగిల్స్‌లో సుధాకర్, రావత్ ఫైనల్‌లో ప్రవేశించారు. విజేతలకు రాష్ట్ర సీనియర్ టెన్నిస్ క్రీడాకారుల సంఘం కార్యదర్శి ఎ.రాంబాబు ట్రోఫీలు బహూకరించారు. టోర్నీ కార్యనిర్వాహక కార్యదర్శి కె.రాధాకృష్ణమూర్తి, డైరెక్టర్ ఎం.మల్లికార్జునరావులు పాల్గొన్నారు.

వర్సిటీ కబడ్డీ విజేత ఎస్సారార్ కళాశాల

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఎస్సారార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో రెండు రోజులు జరిగిన కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల పురుషుల కబడ్డీ టోర్నీలో ఆతిథ్య ఎస్సారార్ జట్టు లీగ్ దశలో ఆడిన అన్ని మ్యాచ్‌ల్లో విజేతగా నిలవడం ద్వారా ఆరు పాయింట్లతో విజేతగా నిలిచింది. నలంద డిగ్రీ కళాశాల జట్టు నాలుగు పాయింట్లతో ద్వితీయ, పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ సైన్స్ కళాశాల రెండు పాయింట్లతో తృతీయ స్థానాల్లో నిలవగా.. ఉయ్యూరులోని ఏజీ, ఎస్‌జీ సిద్ధార్థ కళాశాల జట్టు నాల్గో స్థానంలో నిలిచింది. ముగింపు కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్, టోర్నీ కార్యనిర్వాహక కమిటీ ఛైర్‌పర్సన్ కె.భాగ్యలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు బహూకరించారు. వర్సిటీ జట్టు ఎంపిక కమిటీ సభ్యులుగా ఎం.స్వామి (పీడీ, ఎల్‌హెచ్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మైలవరం), ఎన్.వెంకటేశ్వరరావు(పీడీ, నలంద డిగ్రీ కళాశాల), టోర్నీ పరిశీలకులు బీసీహెచ్ సంగీతరావు (పీడీ, శాతవాహన కళాశాల)లు అతిథులుగా పాల్గొనగా.. టోర్నీ కార్యనిర్వాహక కార్యదర్శి డి.యుగంధర్ పర్యవేక్షించారు.


ముఖ్యఅతిథి భాగ్యలక్ష్మి నుంచి విన్నర్ ట్రోఫీ అందుకుంటున్న ఎస్సారార్ కళాశాల జట్టు

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి ఓపెన్ ఫుట్‌బాల్ టోర్నీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఐజీఎంసీ స్టేడియంలో రెండు రోజులు జరుగుతున్న జేవియర్ రాష్ట్ర స్థాయి ఓపెన్ ఫుట్‌బాల్ టోర్నీలో పలు జట్లకు చెందిన క్రీడాకారులు ఉత్సాహంగా తలపడ్డారు. తొలి రోజైన గురువారం అండర్-11 ఫైనల్‌లో సంగీతరావు క్లబ్ జట్టు 6-0 గోల్స్ తేడాతో హంటింగ్ టైగర్స్ జట్టుపై విజయం సాధించింది. అండర్-13 ఫైనల్స్‌లో విజయవాడ బ్లూస్ జట్టు 2-1 గోల్స్ తేడాతో కింద మెమోరియల్ క్లబ్ జట్టుపై గెలుపొందింది. అండర్-15 కేటగిరీలో జేవియర్ ఫుట్‌బాల్ క్లబ్, హంటింగ్ టైగర్స్ జట్లు ఫైనల్స్‌లో ప్రవేశించాయి. అండర్-18 కేటగిరీలో వెంకట్ ఫుట్‌బాల్ క్లబ్ ఫైనల్‌లో ప్రవేశించగా.. సింగ్‌నగర్ ఫుట్‌బాల్ క్లబ్, సంగీతరావు క్లబ్ జట్లు సెమీ ఫైనల్‌లో ప్రవేశించాయి. అండర్-11, 13 కేటగిరీ విజేతలకు మా జ్యూవెల్లరీస్ ఛైర్మన్ కర్రె సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై ట్రోఫీలు బహూకరించారు.

26న డాక్టర్ ఎన్టీఆర్ వర్సిటీ కబడ్డీ జట్టు ఎంపిక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు ఈ నెల 26వ తేదీన రాజమహేంద్రవరం జీఎస్ఎల్ వైద్య కళాశాల మైదానంలో నిర్వహిస్తామని వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఇ.త్రిమూర్తి తెలిపారు. వర్సిటీకి అనుబంధంగా ఉన్న కళాశాలల విద్యార్థులు ఎంపిక పోటీలో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 30 నుంచి ఆరు రోజులు చెన్నైలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరిగే సౌత్ జోన్ అంతర్ వర్సిటీ పురుషుల కబడ్డీ టోర్నీలో ఎన్టీఆర్ వర్సిటీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఆసక్తిగల విద్యార్థులు తగు అర్హతా పత్రాలతో ఆ రోజు ఉదయం 10 గంటలకు జీఎస్ఎల్ కళాశాల వ్యాయామ సంచాలకుని వద్ద హాజరవ్వాలన్నారు.

ఈత పోటీల్లో సత్తా

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: గోవాలో ఈ నెల 20 నుంచి మూడు రోజులు జరిగిన 24వ జాతీయ పారా స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్ర స్విమ్మర్లు 16 పసిడి, 14 రజత, అయిదు కాంస్య మొత్తం 35 పతకాలు కైవసం చేసుకున్నారని రాష్ట్ర పారా స్పోర్ట్స్ సంఘం కార్యదర్శి వి.రామస్వామి తెలిపారు. నిధి భైపోతు ఒక పసిడి, రజతం, నవీన్‌బాబు మూర్తి కాంస్యం, షేక్ కౌసర్ సాహిల్ మూడు పసిడి, దేవశ్రీ చంద్రేష్ మూడు రజత, కె.సిద్ధావర్మ ఒక రజత, కాంస్యం, సాయి నిఖిల్ గౌతమ్ ఒక పసిడి, రెండు రజత, ప్రేమ్‌చంద్ మూడు పసిడి, బీఆర్‌వీవీ భవాని కార్తీక్ మూడు పసిడి, ఆర్.సంజన ఒక పసిడి, ఒక రజతం, నాగుల్ సురేష్ రెండు పసిడి, ఒక కాంస్యం, బోయిన మోహిత్ రెండు పసిడి, ఒక కాంస్యం, ఎ.లక్ష్మణరావు రెండు పసిడి, ఒక రజతం, పోరెడ్డి చరిత్ రెండు రజత, వి.రవి ఒక పసిడి, ఎ.ప్రణీత్ మూడు రజత పతకాలు సొంతం చేసుకున్నారు. విజేతలను, కోచ్, మేనేజర్లను శాప్ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పీఎస్ గిరీషా, రాష్ట్ర పారా స్పోర్ట్స్ సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరరావు అభినందించారు.


పతకాలు సాధించిన క్రీడాకారులతో సంఘ కార్యదర్శి రామస్వామి

ఆధిక్యంలో ఇంటర్నేషనల్ మాస్టర్ నీలాష్ సాహా

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఐకాన్ పబ్లిక్ స్కూల్‌లో జరుగుతున్న భారతీయ నవీన క్రీడా ఉత్సవ్ (బీఎన్‌కేయూ) ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నీలో రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డుకు ప్రాతినిధ్యం వహించిన ఇంటర్నేషనల్ మాస్టర్ నీలాష్ సాహా(2467) గురువారం ఆరు రౌండ్లు ముగిసేసరికి ఆరు పాయింట్లతో ఆధిక్యంలో కొనసాగుతున్నాడు. ఇంటర్నేషనల్ మాస్టర్ శ్రీహరి (2372) తెల్లపావులతో ఎత్తును ప్రారంభించగా.. ఇంటర్నేషనల్ మాస్టర్ నీలాష్ సాహ నల్లపావులతో పైఎత్తులు వేయడంతో సుమారు నాలుగు గంటల ఇరువురు మధ్య పోటీ సాగింది. తుదిగా నీలాష్ సాహా విజయం సాధించి ఆరు పాయింట్లతో ముందంజలో నిలిచాడు. తమిళనాడుకు చెందిన గ్రాండ్‌మాస్టర్ వెంకటేష్ ఎంఆర్, ఇంటర్నేషనల్ మాస్టర్ శర్వనన్ కృష్ణన్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఇంటర్నేషనల్ మాస్టర్ కౌత్సవ్ కుండు 5.5 పాయింట్లతో కొనసాగుతున్నారు. ఆరో రౌండ్ పోటీలను రాష్ట్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్ పొట్లూరి భాస్కరావు, కువైట్‌కు చెందిన బ్రిటిష్ కౌన్సిల్ ఇన్విజిలేటర్ ఫర్ ఇలెట్స్ దుగ్గిరాల హరిత, ఆంధ్రా చెస్ సంఘం సీఈవో కేవీ జ్వాలాముఖి, ఐకాన్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ కె.రాజేంద్ర, టోర్నీ కన్వీనర్ ఎస్‌కే ఖాసీం, చీఫ్ ఆర్బిటర్ వసంత్ సమక్షంలో మొదటి ఎత్తు వేసి పోటీలు ప్రారంభించారు.



అంతర్ వర్సిటీ బ్యాడ్మింటన్ పోటీలకు డాక్టర్ ఎన్టీఆర్ వర్సిటీ జట్టు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: చెన్నైలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు జరిగే సౌత్ జోన్ అంతర్ వర్సిటీ బ్యాడ్మింటన్ టోర్నీలో పాల్గొనే డాక్టర్ ఎన్టీఆర్ వర్సిటీ జట్టును బుధవారం వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఇ.త్రిమూర్తి వెల్లడించారు. జట్టు సభ్యులను వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు అభినందించారు. జట్టులో పి.రవితేజ, బి.వెంకట తిమ్మరాజు(జీఎస్ఎల్ వైద్య కళాశాల, రాజమండ్రి), పి.ఆదిత్య(ఎన్ఆర్ఐ వైద్య కళాశాల, చిన్నఅవుటపల్లి), ఎ.సోహన్ దత్తా(విష్ణు దంత కళాశాల, భీమవరం), కె.లోకేష్ (ప్రభుత్వ దంత కళాశాల, అనంతపురం), షిమోగా అభిరామ్ (ఆశ్రం వైద్య కళాశాల, ఏలూరు), బి.రంగనాథ్ అంబేడ్కర్(ఆంధ్రా వైద్య కళాశాల, విశాఖ)లు ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ జట్టుకు కోచ్, మేనేజరుగా కె.రాగరాజు(పీడీ, కోనసీమ వైద్య కళాశాల, అమలాపురం) నియమితులయ్యారు.


సభ్యులతో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి, శ్రీనివాసరావు, త్రిమూర్తి, తదితరులు

దేశ్‌కా ట్రక్ ఉత్సవ్ ప్రారంభం



మాట్లాడుతున్న ఈశ్వరరావు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: టాటా మోటార్స్ దేశ్ కా ట్రక్ ఉత్సవ్‌ను టాటా మోటార్స్, స్థానిక డీలర్ జాస్పర్ ఇండస్ట్రీస్ సంయుక్త ఆధ్వర్యంలో స్టెల్లా కళాశాల ఇండోర్ స్టేడియంలో గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు, కృష్ణా జిల్లా అధ్యక్షుడు నాగమోతు రాజా మాట్లాడుతూ వినియోగదారుల మన్ననలు, ఆదరణ పొందిన టాటా హెవీ కమర్షియల్ వాహనాలు రానున్న రోజుల్లో మరింత చేరువుగా వినియోగదారులకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. టాటా మోటార్స్ ఏరియా మేనేజర్ ఎస్.భరణి ధరన్, టెర్రిటరీ సేల్స్ మేనేజర్ ప్రసాద్, రాష్ట్ర సర్వీస్ హెడ్ ఎల్.రాజేంద్రప్రసాద్, జాస్పర్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ పి.వి.సత్యనారాయణరావు, టాటా సంస్థ ప్రతినిధులు, వినియోగదారులు పాల్గొన్నారు. ఆధునిక, సాంకేతికతతో కలిగిన ట్రక్స్, టిప్పర్లను ప్రదర్శించగా.. వినియోగదారులు ఆసక్తిగా తిలకించారు.

క్రీడల్లో రాణించేందుకు చేయూతనివ్వండి

విజయవాడ క్రీడలు: కాకినాడ జిల్లాకు చెందిన అథ్లెట్ మందపల్లి శ్రీనివాసరావు గురువారం రాష్ట్ర రవాణా, యువజన సర్వీసుల, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డిని నగరంలోని ఆయన విడిది కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. బాడీ బిల్డింగ్, అథ్లెటిక్స్‌లో పలు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించానని, గత 24 ఏళ్లుగా ఆర్టీసీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నానని మంత్రికి వివరించారు. పోటీల్లో సాధించిన పతకాలకు రావాల్సిన పదోన్నతులు, జీతాలు నిలిపివేస్తున్నారని మంత్రికి తెలిపారు. క్రీడల్లో రాణించడానికి చేయూత అందించాలని ఆయన మంత్రిని కోరారు. స్థానికంగా యువతకు శిక్షణనిచ్చేందుకు జిమ్ ఏర్పాటు చేయడానికి తగిన తోడ్పాటు అందివ్వాలని మంత్రిని కోరగా.. మంత్రి సానుకూలంగా స్పందించి శ్రీనివాసరావుకు తగిన సహకారం చేస్తామన్నారు.



అథ్లెట్ శ్రీనివాసరావు సాధించిన పతకాలను చూస్తున్న మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి

?విరిచిపేట ఏనుగుల వారి వీధిలో చేతి పంపు పని చేయడం లేదు. -షేక్ మహబూబ్‌ఖాన్, విరిచిపేట
✔వెంటనే మరమ్మతులు చేయిస్తాం. -శ్రీనివాసరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్, నీటి విభాగం
? మయూరి థేటర్ దుకాణ సమీపంలో ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గొయ్యితో ప్రమాదాలు జరుగుతున్నాయి. -వెంకటేశ్వరరావు, కేఎల్‌రావు నగర్
✔ ఆ గుంతను పరిశీలించి పాచ్ వర్క్ చేస్తాం. -ఏఈ శ్రీనివాస్
? చిట్టినగర్ సొరంగం మార్గంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంటుంది. -పి.హెచ్.లక్ష్మణ్ కుమార్, విద్యాధరపురం
✔ సొరంగంలో శుభ్రం చేస్తున్నాం. ఆయినా దృష్టి పెడతాం. -నరసింహారావు, శానిటరీ అధికారి
-న్యూస్‌టుడే, చిట్టినగర్

కార్మికులకు ఒక నెల జీతం ఇవ్వాలి

భవానీపురం, న్యూస్‌టుడే: వరదల్లో కష్టపడిన పారిశుద్ధ్య కార్మికులకు ఒక నెల జీతం బోనస్‌గా ఇవ్వాలని సీఐటీయూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సర్కిల్- 1 గౌరవ అధ్యక్షుడు బోయి సత్యబాబు కోరారు. భవానీపురం 43వ డివిజన్‌లోని పారిశుద్ధ్య కార్మికులతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచాలన్నారు. కార్మికులకు వరద నష్టపరిహారం అందించాలని, మృతి చెందిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలని కోరారు.

విజయవాడ పశ్చిమ

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి ఓపెన్ ఫుట్‌బాల్ టోర్నీ

విజయవాడ క్రీడలు: స్థానిక బీఎస్ఎస్ స్టేడియంలో రెండోరోజులుగా జరుగుతున్న జేవీయర్ రాష్ట్ర స్థాయి ఓపెన్ ఫుట్‌బాల్ టోర్నీలో పలువురు క్రీడాకారులు ఉత్సాహంగా తలపడ్డారు. తొలి రోజైన గురువారం అండర్-11 ఫైనల్‌లో సంగీతరావు క్లబ్ జట్టు 6-0 గోల్స్ తేడాతో హంటింగ్ టైగర్స్‌పై విజయం సాధించింది. అండర్-13 ఫైనల్లో విజయవాడ బ్లూస్ జట్టు 2-1 గోల్స్ తేడాతో కింద మెమోరియల్ క్లబ్ జట్టుపై గెలుపొందింది. అండర్-15 కేటగిరీలో జేవీయర్ ఫుట్‌బాల్ క్లబ్, హంటింగ్ టైగర్స్ జట్టు ఫైనల్లో ప్రవేశించాయి. అండర్-18 కేటగిరీలో వెంకట్ ఫుట్‌బాల్ క్లబ్ ఫైనల్‌లో ప్రవేశించగా.. సింగ్‌నగర్ ఫుట్‌బాల్ క్లబ్, సంగీతరావు క్లబ్ జట్టు సెమీ ఫైనల్‌లో ప్రవేశించాయి.

ట్రాఫిక్ ఇలా.. ప్రయాణం ఎలా..?


వస్త్రలత వద్ద ఆక్రమణకు గురైన బస్‌షెల్టరు

విద్యాధరపురం, న్యూస్‌టుడే

కాళేశ్వరరావు మార్కెట్ కూడలికి వచ్చే వ్యాపారులు: 10 వేలు
ప్రయాణికులు, కొనుగోలుదారులు: 30 వేలు
ముఠా కూలీలు: 1500
కార్లు: 2000
రిక్షాలు: 300
ఈ సెంటర్‌కు వచ్చే బస్సులు: 350
ఆటోలు: 600
ద్విచక్ర వాహనాలు: 3,000
వ్యాన్లు, గూడ్స్ ఆటోలు: 400

పాతబస్తీలో కాళేశ్వరరావు మార్కెట్ సమీపంలోని వస్త్రలత దుకాణ సముదాయం కీలకమైన కూడలి. ఈ నేపథ్యంలో నిత్యం వేలాది మంది వ్యాపారులు, కొనుగోలుదారులు, ఉద్యోగులు, ముఠా కూలీలు వివిధ అవసరాల నిమిత్తం తమ వాహనాలపై ఇక్కడికి వస్తుంటారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీనికి తోడు ఇక్కడ ఉన్న బస్సు షెల్టర్లను ఆక్రమణదారులు కబ్జా చేశారు. ఈ క్రమంలో ప్రయాణికులు బస్సుల


పద్మవ్యూహాన్ని తలపిస్తున్న కాళేశ్వరరావు మార్కెట్ కూడలి

అడ్డదిడ్డంగా వాహనాల నిలిపివేత

కోసం రోడ్డు మీదనే వేచి ఉండాల్సిన పరిస్థితి. ఆటోలు కూడా ఈ సెంటర్‌లో నిలుపుతుండడంతో ఆర్టీసీ బస్సులు ఎక్కేవారు, దిగేవారు నానా అవస్థలు పడుతున్నారు. దూసుకెళ్తున్న వాహనాల మధ్య ప్రాణాలు అరచేత పట్టుకొని బిక్కుబిక్కు మంటున్నారు. ట్రాఫిక్ పోలీసులు ఒకవైపు మైకులో చెబుతున్నప్పటికీ ఆటో చోదకులు రూపాదీ మధ్యలోనే వాటిని నిలిపి ప్రయాణికులను ఎక్కించడం ఇక్కడ సర్వ సాధారణం.

రోడ్డు మీదనే వ్యాపారాలు...

ఈ ప్రాంతంలో దుకాణాదారుల కంటే ఆక్రమణదారులే హల్‌చల్ చేస్తుంటారు. వస్త్రలత, హెడ్ పోస్టాఫీసు, కాళేశ్వరరావు మార్కెట్ చుట్టూ వీరి సంఖ్య రెండు వేలకు పైనే ఉంటుంది. ఇక్కడ గుండు సూది మొదలు.. చరవాణి వరకు వీరి విక్రయాలు ఉంటాయి. కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పూలు, తినుబండారాలు రహదారి మీదే విక్రయిస్తుండడంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. అసలు దుకాణం లోపలికి కూడా వెళ్లేందుకు సాధ్యపడడం లేదని అద్దెలు చెల్లించే వ్యాపారులు వాపోతున్నారు. ఆక్రమణదారుల

కారణంగా ఇక్కడ కొనుగోళ్లు నిమిత్తం వచ్చిన వారి జుట్టులు, చేతి సంచుల్లో అభరణాలు, నగదు సైతం దోపిడీ గురవుతున్న ఘటనలు వన్‌టౌన్ పోలీసు స్టేషనులో ఉన్నాయి. సంబంధిత అధికారులు హాకర్ జోన్‌లను విభజించి ఆక్రమణదారులను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని నగర వాసులు కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్యలను నియంత్రిస్తాం

దసరా ఉత్సవాలు, డ్రోన్ సమ్మిట్ కారణంగా కాళేశ్వరరావు మార్కెట్ కూడలిపై శ్రద్ధ చూపలేకపోయాం. కార్పొరేషను, పోలీసు సమన్వయంతో సెంటర్‌లోని ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. ఆటోవాలలు, తోపుడు బండ్ల వ్యాపారుల జీవనం దెబ్బ తినకుండా నిర్ణయించిన పరిమితిలోనే ఉండేలా అవగాహన కల్పిస్తాం. ఆటోలు, ద్విచక్ర వాహనాలు, కార్లు పార్కింగ్ స్థలాల్లో నిలుపకుంటే అట్టి వారికి జరిమానాలు విధిస్తున్నాం. వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే అధిక శాతం సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.
- ఉమామహేశ్వరరావు, ట్రాఫిక్ సీఐ

ప్రతిభ చాటారు.. బహుమతులు గెలుపొందారు


విజేతలతో పాఠశాల డైరెక్టర్ ఎస్.వి.రావు, సమన్వయకర్త రమేష్, వ్యాసం రాస్తున్న విద్యార్థులు

చిట్టినగర్: కేఎల్‌రావు నగర్ సిండికేటు బ్యాంకు కాలనీలోని రాకేష్ ఆంగ్ల పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో గురువారం ప్రతిభ పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాలం వినియోగం వల్ల లాభ నష్టాలు- విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై జరిగిన వ్యాస రచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఎం.డి.మిరాజ్(పదో తరగతి), ఎస్.కె.మొహిన(తొమ్మిదో తరగతి), ఆర్.సిద్ధి శ్రీనివాసన్(ఎనిమిదో తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి పాఠశాల డైరెక్టర్ ఎస్.వి.రావు, సమన్వయకర్త రమేష్ బహుమతులు అందించి అభినందించారు.

ట్రాఫిక్ నియంత్రణకు కృషి


అధికారులతో చర్చిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని ప్రధానమైన కూడలి ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు అన్ని చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పోలీసు అధికారులకు సూచించారు. ట్రాఫిక్ పోలీసు అధికారులతో నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆయన గురువారం ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల శ్రేయస్సు, ఇతర సమస్యల పరిష్కారానికి నగరపాలక సంస్థ పోలీసు అధికారులకు అవసరమైన సహకారం అందిస్తుందని తెలిపారు.. పలు ప్రాంతాలు, కూడళ్లలోని ట్రాఫిక్ ఇబ్బందులను ట్రాఫిక్ పోలీసు కమిషనర్ దృష్టికి తేగా.. వాటి పరిష్కారానికి అనువైన చర్యలకు సహకారం ఉంటుందని తెలిపారు.

బాణసంచా దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: దీపావళి సందర్భంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో టపాసుల బాణసంచా దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాధరపురం(లేబర్ కాలనీ) క్రీడా ప్రాంగణం, సింగ్‌నగర్ మాకినేని బసవ పున్నయ్య మున్సిపల్ క్రీడా ప్రాంగణ ప్రాంతాల్లో విక్రయ దుకాణాలు ఏర్పాటుకు లైసెన్సు కలిగిన వ్యాపారుల నుంచి మాత్రమే దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ నెల 29 నుంచి 31 వరకు నిర్దేశిత ప్రాంతాల్లో దుకాణాలు నిర్వహించుకునేందుకు సత్యనారాయణపురం సర్కిల్-2లోని ఎస్టేట్ కార్యాలయం నుంచి ఈ నెల 24వ తేదీ నుంచి 28వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యాలయం పనిచేసే దినాల్లో వ్యాపారులు దరఖాస్తులను పొందవచ్చని తెలిపారు. తిరిగి దరఖాస్తులు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఆపై దరఖాస్తులు చేసుకున్న వారిని 28వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు దరఖాస్తుదారుల సమక్షంలోనే లాటరీ పద్ధతిన ఎంపిక చేసి, దుకాణాలను కేటాయిస్తామని ఆయన వెల్లడించారు.

పోలియోపై అవగాహన అవసరం

చిట్టినగర్, న్యూస్‌టుడే: పోలియో రహిత దేశంగా రూపుదిద్దేందుకు ప్రతి ఒక్కరు నడుం బిగించాలని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ పతంజలి శాస్త్రి పిలుపు నిచ్చారు. ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా ఆ కళాశాల రోటరాక్ట్ క్లబ్, హాబీస్ క్లబ్, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పుట్టిన ప్రతి పిల్లవాడికి విధిగా పోలియో చుక్కలు క్రమం తప్పకుండా వేయించాలన్నారు. ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉంటే పిల్లలు పోలియో బారిన పడకుండా నివారించవచ్చని తెలిపారు. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా జీవితం అంగ వైకల్యం అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు. పోలియో నిర్మూలనకు యువత చైతన్యవంతం కావాలని సూచించారు. ఏన్నెస్సెస్ నరేష్, రమాదేవి, శ్రీకాంత్‌రెడ్డి, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ప్రదర్శనను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ పతంజలి శాస్త్రి

ప్రణాళికాధికారులకు డివిజన్ల కేటాయింపు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగంలో విధులు నిర్వహిస్తూ పలువురు ప్రణాళికాధికారులు తాజాగా బదిలీ కాగా, మరికొందరు అధికారులు బదిలీపై వచ్చి విధుల్లో చేరారు. వీరికి నగరంలోని 64 డివిజన్ల ప్రాంతాల బాధ్యతలను ప్రస్తుతం సర్దుబాటు చేశారు. ఇప్పటికే ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ముగ్గురు అధికారులతో పాటు, కొత్తగా వచ్చిన ముగ్గురు అధికారులకు పలు డివిజన్ల బాధ్యతలు అప్పగించారు. పలువురిని అంతర్గతంగా మార్పు చేసి పలు డివిజన్ల పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. ఇలా టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్లు(టీపీవోలు), టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్లు(టీపీఎస్‌లు) ప్రస్తుతం ఆరుగురు ప్రణాళికా విభాగంలో ఉండగా, వీరికి మూడు నియోజకవర్గాల్లోని డివిజన్లను సర్దుబాటు చేశారు. ఈ మేరకు కమిషనర్ ధ్యానచంద్ర గురువారం సాయంత్రం ఆదేశాలు జారీచేశారు.

డివిజన్ల వారీగా..

★ బి.మురళీగౌడ్(టీపీవో-1, 2): 38, 39, 40, 41, 42, 44, 43, 45, 46, 47, 48 డివిజన్లు ★ ఎస్.గిరి(టీపీఎస్-3, 4): 34, 35, 49, 55, 56, 37, 50, 51, 52, 53, 54. ★ జి.కృష్ణ(టీపీవో-5, 7)- 57, 60, 61, 62, 63, 64, 27, 28, 29, 31, 33. ★ ఎస్.కె.మతీన్ మోహజీజ్: (టీఎస్-8, 6): 23, 24, 25, 26, 36, 1, 30, 32, 58, 59. ★ వసీంబేగ్(టీపీఎస్-9, 11): 2, 3, 4, 5, 10, 11, 12, 13, 14 ★ సీహెచ్ రఘునందనరావు(టీపీవో-10, 12): 6, 7, 8, 9, 19, 15, 16, 17, 18, 20, 21, 22)

న్యాయం చేసే వరకు పోరాటం చేస్తాం

చిట్టినగర్, న్యూస్‌టుడే: బుడమేరు వరద వల్ల పరిహారం అందక అన్యాయం జరిగిన బాధితులను గుర్తించి వెంటనే నష్ట పరిహారం అందించాలి, లేదంటే న్యాయం చేసే వరకు పోరాడతామని సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు


జాబితా చూపుతున్న కార్పొరేటరు సత్యబాబు తదితరులు

ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కొత్తపేటలోని శ్రామిక భవన్‌లో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. వరదలో అనేక మంది సర్వం కోల్పోయి వీధిన పడ్డారని, వారికి ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వలేదన్నారు. సర్వేలో అనేక తప్పులు దొర్లాయని, దీనిలో అవకతవకలు జరిగాయని, రకరకాల కారణాలతో నమోదైన వారికి కూడా పరిహారం అందించడంలేదని బాధాకరమన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి బాధితుల ఆక్రందనను పరిగణలోకి తీసుకుని సమస్యను సీఎం దృష్టికి తెచ్చి తగు న్యాయం చేయాలని కోరారు. ఈ నెల 25న తహసీల్దార్ కార్యాలయం వద్ద వరద బాధితులతో ధర్నా నిర్వహిస్తున్నామని చెప్పారు. మాజీ కార్పొరేటర్ గాదె ఆదిలక్ష్మి, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఒంటికి వస్తే.. ఇంటికెళ్లే దాకా ఆగాల్సిందే

చిట్టినగర్, న్యూస్‌టుడే

పశ్చిమంలోని పలు కూడళ్లలో ఇదీ పరిస్థితి

నగరంలో పెరిగిన జనాభా రద్దీ దృష్ట్యా వారికి కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పన శూన్యమనే చెప్పాలి. ఇంటి నుంచి బయటకు వివిధ పనులపై మహిళలు, యువతులు, పురుషులు రోడ్డు మీదకు రావాల్సిందే. బస్టాప్‌లో నిలబడాల్సిందే. ఈ నేపథ్యంలో ఒకటికి, రెంటికి వెళ్లాలన్నా నానా పాట్లు పడాల్సిందే. సున్నితమైన ఈ సమస్య అటు పాలకులు, ఇటు నగరపాలక సంస్థ అధికారులకు మాత్రం పట్టడం లేదు. చిట్టినగర్, బ్రైజర్‌పేట ప్రధాన రహదారి పక్కన శౌచాలయాలు ఉన్నప్పటికీ వాటి పరిస్థితి దయనీయం. అధ్వానంగా, తీవ్ర దుర్వాసనతో వినియోగంలోకి లేని పరిస్థితి. వాటి గురించి పట్టించుకున్న వారే కరవయ్యారు. దీంతో బహిరంగంగానే మూత్ర విసర్జన చేయాల్సిన దుస్థితి ఉంది.

ఇబ్బందులు వర్ణనాతీతం..

ఇక మహిళలు పడే ఇబ్బందులు వర్ణనాతీతం. బహిరంగంగా మూత్ర విసర్జన వల్ల దుర్వాసనతో పాటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. పాలప్యాక్టరీ నుంచి కొత్తపేట వరకు, కలేశా నుంచి కుమ్మరిపాలెం సెంటర్


బ్రైజర్‌పేట రోడ్డులో అధ్వానంగా మూత్రశాల

వరకు ఎక్కడా మరుగుదొడ్లు లేవు. చిట్టినగర్ నుంచి ఎర్రకట్ట వెళ్లే మార్గంలో బ్రైజర్‌పేటలో ఉన్నప్పటికీ అవి అధ్వానంగా ఉన్నాయి. వాటి గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పశ్చిమ నియోజకవర్గంలో పలు కూడళ్లలో మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేసే వాటి పరిశుభ్రతకు సిబ్బందిని నియమించాలంటూ కొందరు 'న్యూస్‌టుడే'తో తమ ఆవేదనను ఇలా వ్యక్తం చేస్తున్నారు.

ఆధునిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తే మేలు

చిట్టినగర్ ప్రధాన కూడలి. ఇక్కడ పనులకు వెళ్లే వారు బస్సులు, ఆటోల కోసం వేచి ఉంటారు. ఈ క్రమంలో అత్యవసరంగా మూత్ర, మల విసర్జన చేయాలంటే అవకాశం లేదు. మూత్రశాలలు ఉన్నప్పటికీ దారుణంగా ఉంది. దీంతో పక్కనే ఉన్న పాఠశాల తరగతి గదుల్లోకి దుర్వాసన కూడా వెలువడుతోంది. ప్రజల అవసరాల దృష్ట్యా చిట్టినగర్‌తో పాటు ఇతర ప్రధాన కూడలిలో ఆధునిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తే మేలు. - అప్పారావు, చిట్టినగర్

బయటకు రాక తప్పదు

వివిధ పనుల నిమిత్తం మహిళలు నగరంలోకి వెళ్లాలంటే బయటకు రాక తప్పదు. ఎంత జాగ్రత్తలు తీసుకున్నా ఒక్కోసారి అత్యవసరంగా మరుగుదొడ్లు ఉపయోగించుకోవాల్సి వస్తుంది. సున్నితమైన సమస్య పరిష్కారానికి సాయిరాం థియేటర్ సెంటర్, చిట్టినగర్, కలేశా, విద్యాధరపురం కూడలి వంటి ప్రధాన కూడళ్లలో మరుగుదొడ్లు అవసరం. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని మనవి. -శ్రీదేవి, కేఎల్‌రావునగర్

నాయీ బ్రాహ్మణుల నియామకం హర్షణీయం

విద్యాధరపురం, న్యూస్‌టుడే: ఆలయ ట్రస్టు బోర్డుల్లో నాయీ బ్రాహ్మణులను నియమించడం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బ్రహ్మయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు ఇతర పార్టీలు వీరిని రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకోవడం మినహా గుర్తింపు ఇవ్వలేదని, ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రతి ఆలయ ట్రస్టు బోర్డులో నాయీ బ్రాహ్మణుడిని సభ్యుడిగా నియమించాలని తీసుకున్న నిర్ణయం ప్రశంసనీయమన్నారు. అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే కేశఖండనశాలలో పని చేసే వారికి రూ.40 టిక్కెట్టుపై వచ్చే మొత్తాన్ని కేటాయించడంతో పాటు కనీసం 20 వేల వేతనం ఇచ్చేలా నిర్ణయం తీసుకోవడం బీసీలపైన తెదేపా ఆదరణకు ఉన్న అభిమానాన్ని స్పష్టం చేస్తోందన్నారు.

ఉచిత ఇసుక లేక కార్మికుల జీవనం దుర్భరం

చిట్టినగర్, న్యూస్‌టుడే: ఉచిత ఇసుక విధానం సరిగా అమలు చేయకపోవడంతో భవన నిర్మాణ పనులు లేక కార్మికులు జీవన విధానం దుర్భరంగా ఉందని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి నరసింహారావు అన్నారు. కొత్తపేటలోని మోటూరు హనుమంతరావు శ్రామిక భవన్‌లో సీఐటీయూ పశ్చిమ జోన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచిత ఇసుక విధానం ఎక్కడ అమలు కావడం లేదని ఆరోపించారు. ట్రాక్టర్ ఇసుక రూ.7 నుంచి 8 వేలు వెచ్చించి కొనాల్సి వస్తుందని వాపోయారు. జీవో నం- 1214ను రద్దు చేసి సంక్షేమ పథకాలను అమలు చేసే విధంగా సంక్షేమ బోర్డు పని చేసేలా చూడాలని కోరారు. సంఘ నాయకులు సుబ్బారెడ్డి, నారాయణ, శ్రీను, జానీ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నరసింహారావు, సుబ్బారెడ్డి తదితరులు

వీనుల విందుగా భక్తి రంజని

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దసరా పర్వదినం కార్యక్రమంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై గురువారం విశాఖపట్నంకు చెందిన సుజని బృందం పలు భక్తిగీతాలను వీనుల విందుగా ఆలపించారు. దుర్గమ్మ దర్శనం చేసుకున్న భక్తులు ఈ కార్యక్రమాన్ని ఆసక్తిగా వీక్షించారు. అనంతరం ఐదులో పాల్గొన్న కళాకారులను దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఈవో రామారావు వారికి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.



గీతాలు ఆలపిస్తున్న సుజని బృందం

వర్సిటీ కబడ్డీ విజేత ఎస్సార్ఆర్ కళాశాల


విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఎస్సార్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో రెండు రోజులు జరిగిన కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల పురుషుల కబడ్డీ టోర్నీలో ఆతిథ్య ఎస్సార్ఆర్ జట్టు లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో విజేతగా నిలవడం ద్వారా ఆరు పాయింట్లతో విజేతగా నిలిచింది. నలంద డిగ్రీ కళాశాల జట్టు నాలుగు పాయింట్లతో ద్వితీయ, పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ సైన్స్ కళాశాల రెండు పాయింట్లతో తృతీయ స్థానాల్లో నిలిచాయి. ఉయ్యూరులోని ఏజీ, ఎస్జీ సిద్ధార్థ కళాశాల జట్టు నాల్గో స్థానంలో నిలిచింది. ముగింపు కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్, టోర్నీ కార్యనిర్వాహక కమిటీ చైర్‌పర్సన్ కె.భాగ్య లక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు బహూకరించారు. వర్సిటీ జట్టు ఎంపిక కమిటీ సభ్యులుగా ఎం.స్వామి (పీడీ, ఎల్‌హెచ్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మైలవరం), ఎన్.వెంకటేశ్వరరావు(పీడీ, నలంద డిగ్రీ కళాశాల), టోర్నీ పరిశీలకులు బీసీహెచ్ సంగీతరావు (పీడీ, శాతవాహన కళాశాల)లు ఆతిథులుగా పాల్గొన్నారు.. టోర్నీ కార్యనిర్వాహక కార్యదర్శి డి.యుగంధర్ పర్యవేక్షించారు.

ముందస్తు జాగ్రత్తలతో దొంగతనాలకు అడ్డుకట్ట


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారి

భవానీపురం, న్యూస్‌టుడే: ప్రజలు ముందస్తు జాగ్రత్తలను పాటించడం వల్ల దొంగతనాలను జరగకుండా అడ్డుకోవచ్చని ఏసీపీ(క్రైం) ఎం.రాజారావు పేర్కొన్నారు. భవానీపురం స్టేషన్ పరిధిలోని సాయిపురం కాలనీ, డేవీ అపార్టుమెంట్లలో అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు ఊరు వెళ్లినప్పుడు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎల్‌హెచ్ఎంఎస్‌ను ఉపయోగించుకోవాలని, ఎవరైనా దొంగ ఇంట్లోకి వచ్చే ప్రయత్నం చేసిన వెంటనే సమాచారం వెళ్తుందని, దీంతో దొంగలను పట్టుకోవచ్చని తెలిపారు. విలువైన వస్తువులను లాకర్‌లో పెట్టుకోవాలని సూచించారు. చోరీలు ఏ విధంగా జరుగుతాయో, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. స్టేషన్ సీఐ ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అటు వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే..!



పాత రాజరాజేశ్వరీపేట జేపీ అపార్ట్‌మెంట్ ఎదురుగా ఉన్న మ్యాన్‌హోల్ పొంగి మురుగు రహదారిపై ప్రవహిస్తోంది. పది రోజులుగా ఇదే ఈ పరిస్థితి ఉందని, కనీసం ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. మురుగు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో తీవ్ర దుర్వాసనతో పాటు దోమలు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, చిట్టినగర్

వరద బాధితులకు సాయం అభినందనీయం

భవానీపురం, న్యూస్‌టుడే: వరద బాధితులకు సాయం అందించడం అభినందనీయమని ఆడిటర్ కొత్తపల్లి సుబ్బారావు పేర్కొన్నారు. సుజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో 44వ డివిజన్‌లోని వరద బాధితులకు నిత్యావసర సరకులను అందించే కార్యక్రమం ఊర్మిళా నగర్‌లోని ఒక కల్యాణ మండపంలో గురువారం జరిగింది. ఆయన మాట్లాడుతూ వరద కారణంగా నష్టపోయిన బాధితులను ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ నాయకులు ఆదుకోవడం అభినందనీయమన్నారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు మాట్లాడుతూ కొన్ని రోజులుగా విజయవాడ పశ్చిమ, మైలవరం నియోజకవర్గంలోని వరద బాధితులకు సాయం అందిస్తున్నట్లు తెలిపారు. నాయకులు మొబిలయిన రాంబాబు, నాగబాబు, గణేష్, శివ తదితరులు పాల్గొన్నారు.


సరకులు ఇస్తున్న సుబ్బారాయుడు, సుబ్బారావు

గంజాయి రవాణా ముఠా అరెస్టు

మోతుగూడెం, న్యూస్‌టుడే: చింతూరు మండలం మోతుగూడెం పోలీసులు గురువారం సాయంత్రం గంజాయి రవాణా చేస్తున్న ముఠాను అరెస్టు చేశారు. ఎస్సై శివన్నారాయణ కథనం ప్రకారం.. ముందస్తు సమాచారం మేరకు మోతుగూడెం పోలీస్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఒడిశా రాష్ట్రం పసుపులంక గ్రామం నుంచి కొనుగోలు చేసి విజయవాడ తరలిస్తున్న రూ.10 వేల విలువైన రెండు కిలోల గంజాయి పట్టుబడింది. విజయవాడ పంజా కూడలికి చెందిన షేక్ రిజ్వాన్, కేఎల్‌రావు నగర్‌కు చెందిన కూరగంటి సుభాష్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. రెండు కిలోల గంజాయి, రెండు చరవాణులను సీజ్ చేశారు. ఏఎస్సై రాజేశ్వరరావు, హెచ్‌సీ పుర్షోత్తం, కానిస్టేబుళ్లు ఈశ్వరరావు, ఎన్ఆర్‌కే రాజు, ఏఆర్, ఏపీఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.


పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

భవానీపురం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడినట్లు భవానీపురం పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి...పిల్లి రామకృష్ణ(49) గొల్లపాలెం గట్టు ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. ఈ నెల 20న రాత్రి 8న ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా సొరంగం వద్దకు వచ్చే సరికి బైక్‌పై వస్తున్న మరో వ్యక్తి అతన్ని ఢీకొట్టాడు. దీంతో గాయపడిన రామకృష్ణను విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతున్నారు. ఆక్కడ నుంచి వచ్చిన సమాచారం మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విజయవాడ మధ్య

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
63036 11232

విద్యుత్తు దీపం ఏర్పాటు



సీతారాంపురం, న్యూస్‌టుడే : బీఆర్టీఎస్ రోడ్డులోని హెచ్‌సీజీ క్యాన్సర్ హాస్పిటల్ వద్ద విద్యుత్తు స్తంభం (1/238/509)పై కొద్ది రోజులుగా వెలగడం లేదు. రాత్రిళ్లు చీకటిగా ఉంటోందని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా..'కు సమాచారం అందించారు. దీనిపై ఈ నెల 22న 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. సంబంధిత శాఖ అధికారులు స్పందించారు. సిబ్బందితో విద్యుత్తు దీపాన్ని ఏర్పాటు చేయించారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సైడు కాలువలో చెత్త తొలగింపు



సీతారాంపురం : దేవీనగర్ ఆర్ లైన్‌లోని డీఆర్‌డబ్ల్యూ-681 వద్ద సైడు కాలువ చెత్తతో పూడుకుపోయింది. దీనిపై ఈ నెల 23న 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. వీఎంసీ అధికారి రామకోటేశ్వరరావు స్పందించారు. సిబ్బందితో సైడు కాలువలో పూడిక తీయించి, శుభ్రం చేయించారు.

బాణసంచా దుకాణాలకు దరఖాస్తులు

విజయవాడ నగరపాలక సంస్థ: దీపావళి సందర్భంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పలుచోట్ల బాణ సంచా దుకాణాలు ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాధరపురం(లేబర్ కాలనీ) క్రీడాప్రాంగణం, సింగ్‌నగర్ ఎంబీ స్టేడియంలో దుకాణాల ఏర్పాటుకు లైసెన్సు కలిగిన వ్యాపారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 29 నుంచి 31 వరకు సత్యనారాయణపురం సర్కిల్-2లోని ఎస్టేట్ కార్యాలయం నుంచి ఈ నెల 24వ తేదీ నుంచి 28వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు ఆఫీసు పనివేళ దినాల్లో వ్యాపారులు దరఖాస్తులు పొందవచ్చని పాటు, తిరిగి దరఖాస్తులను చేసుకోవాలని ఆయన తెలిపారు. ఆపై దరఖాస్తులు చేసుకున్నవారికి 28వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు దరఖాస్తుదారుల సమక్షంలోనే లాటరీ పద్ధతిన ఎంపికచేసి, దుకాణాలు కేటాయిస్తామని ఆయన వెల్లడించారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

సత్యనారాయణపురం, న్యూస్‌టుడే : ముత్యాలంపాడు విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో లైన్ల మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 25వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామని కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్రబాబు తెలిపారు. భగత్‌సింగ్ రోడ్డు, దండమూడి రామ్మోహన్ వీధి, వందనపు వారి వీధి, శివాలయం రోడ్డు, బ్రహ్మయ్య పంతులు వీధి, స్టేర్వారి వీధి, గిరివీధి ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రైలొస్తోంది.. ఆగిపోండి..!



వి.వి.నరసరాజురోడ్డులో పైన రైలు వెళుతుంటే.. కింద ఆగిపోయిన వాహనచోదకులు



మధురానగర్‌లో రైలు పట్టాల కింద వర్షాలు పడకుండా ఏర్పాటు చేసిన ఇనుప రేకులు



రేకులు ఉన్నా.. నీరు పడుతోంది ఇలా..

మధురానగర్, న్యూస్‌టుడే

నియోజకవర్గ పరిధిలో రైలు వస్తుందంటే మాత్రం.. వంతెనల కింద రాకపోకలు నిలిపివేస్తున్నారు. ఎంతటి వాహనాలు సరే ఆగాల్సిందే. అక్కడేమీ గేట్లు ఉండవు. వర్షంగా వెళ్లిపోవచ్చు. అయినా ప్రయాణికులు ఆగిపోతున్నారు. ఎందుకని అనుకుంటున్నారా.... రైలు టాయిలెట్ల నుంచి వాడుక నీరు, వ్యర్థాలు కింద పడుతున్నాయి. అటుగా వెళ్లే ఆగిపోతున్నారు. రైలు వెళ్లిపోయే వరకు జోకేలు వేస్తున్నారు. మధురానగర్ వి.వి.నరసరాజురోడ్డు, దేవీనగర్-రామకృష్ణాపురం మధ్య రైలు వంతెనలు వాహనచోదకులు, పాదచారులను భయపెడుతున్నాయి. ప్రధానంగా పాత రైల్వే ట్రాక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. మధురానగర్‌లో రైల్లో వాడిన నీరు, మరుగుదొడ్ల వ్యర్థాలు కింద పడకుండా ఇనుప రేకులు ఏర్పాటు చేశారు. అయినా ఉపయోగం లేకుండా పోయింది. రేకుల మధ్యలో నుంచి కింద పడుతున్నాయి. దేవీనగర్-రామకృష్ణాపురం మధ్య అలాంటి ఏర్పాట్లే లేవు. ఇటుగా రాకపోకలు సాగించాలంటే ప్రజలు జంకుతున్నారు. రైల్వే అధికారులు.. శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

ఉర్రూతలూగిస్తుంది'క'.!



మాట్లాడుతున్న హీరో కిరణ్. చిత్రంలో సారిక, సుజిత్, గోపాలకృష్ణారెడ్డి

విజయవాడ నగరంలో గురువారం 'క' చిత్రం యూనిట్ బృందం సందడి చేసింది. గాంధీనగర్‌లోని రాజ్, యువరాజ్ థియేటర్‌లో ఈ చిత్రం ట్రైలర్‌ను లాంఛనంగా విడుదల చేశారు. అనంతరం యూనిట్ సభ్యులు కథానాయకుడు కిరణ్ అబ్బవరం ఆకట్టుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. 'ఈ నెల 31న దీపావళి పండగ సందర్భంగా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడంలో చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. 1970 బ్యాక్ డ్రాప్‌లో జరిగిన ఒక కథ ఆధారంగా దర్శకద్వయం సుజిత్ సందీప్ అద్భుతంగా తెరకెక్కించారు. జాతర నేపథ్యంలో వచ్చే ఒక పాట ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తుంది. పీరియాడిక్ థ్రిల్లర్ నేపథ్యంలో ప్రతి సన్నివేశం ఆకట్టుకునేలా చిత్రీకరించారు. ఎవరూ ఊహించని విధంగా క్లైమాక్స్ ఉంటుందని వివరించారు. హీరోయిన్ నయన్ సారిక మాట్లాడుతూ.. తెలుగులో తాను నటిస్తున్న మొదటి చిత్రం ఇదేనని, ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. దర్శక నిర్మాతలు సుజిత్, గోపాలకృష్ణారెడ్డిలు మాట్లాడుతూ.. భారీ బడ్జెట్‌తో తీసిన ఈ చిత్రం ప్రేక్షకులను నవ్విస్తుందని చెప్పారు. - న్యూస్‌టుడే, విజయవాడ(గాంధీనగర్)

ఏసీ సులభ్ కాంప్లెక్సు ప్రారంభం



ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, బాలస్వామి తదితరులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ఏసీ సులభ్ కాంప్లెక్సు స్వచ్ఛత, పరిశుభ్రతకు నిదర్శనమని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం బీసెంట్ రోడ్డులో సులభ్ ఇంటర్నేషనల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ వారి ఏసీ సులభ కాంప్లెక్సును తెదేపా ఫ్లోర్‌లీడర్ నల్లి బండ్ల బాలస్వామితో కలిసి ఆయన ప్రారంభించారు. అత్యాధునిక సాంకేతికతతో దీనిని నెలకొల్పారని, దివ్యాంగులకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రంజిత్ కుమార్, హలో కుమార్‌సింగ్, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగులకు సన్మానం

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే : అర్హులైన ప్రతి ఒక్కరినీ అటల్ పెన్షన్ యోజన పథకంలో చేరేలా బ్యాంకులు కృషి చేయాలని పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్‌ఆర్‌డీఏ) చీఫ్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం పాయకాపురంలోని ఆహ్వాన్ కల్యాణ మండపంలో రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ పథకం అమలులో బ్యాంకులు మెరుగైన పనితీరు కనబరుస్తున్నాయని ప్రశంసించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 31 లక్షల మంది చేరారని తెలిపారు. ఎస్‌ఎల్‌బీసీ కన్వీనర్ బాష్యంరావు మాట్లాడుతూ.. 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు ఉన్న వారు ఈ పథకంలో చేరవచ్చని తెలిపారు. అత్యుత్తమ పనితీరు కనబరిచిన బ్యాంకులు, బ్రాంచి మేనేజర్లు, ఎల్‌డీఎంలు, బిజినెస్ కరస్పాండెంట్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎల్‌బీసీ కోఆర్డినేటర్లు రాజశేఖర్, శ్రీనివాస్, ఎన్టీఆర్ జిల్లా ఎల్‌డీఎం కె.ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణనపై పోరాటం తీవ్రతరం

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : బీసీ కులగణనపై పోరాటం తీవ్రతరం చేస్తామని బీసీవై రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ పూర్ణచంద్రరావు తెలిపారు. గురువారం ఇక్కడి ఓ హోటల్‌లో బీసీ సంఘాల సమన్వయ కమిటీ ఏర్పాటు సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో బీసీల డిమాండ్‌కు తలొగ్గిన ప్రభుత్వం కులగణన చర్యలకు ఉపక్రమించిందని చెప్పారు. కానీ ఏపీలో బీసీల గొంతులు చెబుతున్న కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కులగణన ఉద్యమాన్ని గ్రామ స్థాయి నుంచి ఉద్ధృతం చేస్తామన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి.పరంజ్యోతి మాట్లాడుతూ.. బీసీ సమన్వయ కమిటీ, బహుజన సమన్వయ కమిటీలు ఇకపై కలిసి పని చేస్తాయని చెప్పారు. పార్టీలు, సంఘాలకతీతంగా బీసీ నాయకులను సంఘటితపరుస్తామని, హక్కుల సాధనకు, రాజ్యాధికారం కోసం ఉద్యమాలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆధారాలుంటేనే అద్దెకు గదులు



సూచనలిస్తున్న ఏసీపీ బంగారాజు.. పక్కన సీఐ నాగమురళి

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : పూర్తి ఆధారాలు తీసుకున్న తర్వాతే హోటళ్లలో గదులు అద్దెకు ఇవ్వాలని సౌత్ ఏసీపీ బంగారాజు పేర్కొన్నారు. గురువారం రాత్రి గవర్నర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో హోటళ్లు, లాడ్జిల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ.. మైనర్లకు రూమ్‌లు అద్దెకు ఇవ్వొద్దని, అలా ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎక్కువగా ఉండేట్లు ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. కాగా గవర్నర్‌పేట గోపాలరెడ్డిరోడ్డులోని శ్రీలక్ష్మీ సాయి రెసిడెన్సీ వాసులకు సైబర్‌నేరాలపై అవగాహన నిర్వహించారు. సీఐ అడపా నాగమురళీ మాట్లాడుతూ.. సైబర్‌నేరాలతో అందరూ మోసపోతున్నారని తెలిపారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు సమాధానం ఇవ్వొద్దని చెప్పారు. ఎవరైనా ఫోన్ చేసి పోలీసులమని బెదిరించినా, అరెస్టు చేస్తామని భయపెట్టినా.. ఏ మాత్రం భయపడవద్దని సూచించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

యాప్‌ల భారం తగ్గించండి



ఉపాధ్యాయులకు సభ్యత్వ పత్రం అందిస్తున్న రమేష్, పక్కన బీటీఏ సభ్యులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు డిమాండ్ చేశారు. నగరంలోని పలు పాఠశాలల్లో గురువారం బీటీఏ సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులపై యాప్‌ల భారం అధికంగా ఉందన్నారు. ఇది బోధనపై పడుతోందని చెప్పారు. ప్రభుత్వం స్పందించి ఇబ్బందిగా ఉన్న యాప్‌లను తగ్గించాలని కోరారు. బీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెల మణిబాబు మాట్లాడుతూ.. 12వ పీఆర్‌సీని ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని కోరారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఇంటి రాజు మాట్లాడుతూ.. మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో తాతా సూరిబాబు, మట్టా రాజేష్, బి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ ప్రారంభించరూ..

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే శాసన ప్రక్రియ ప్రారంభించాలని ఇండస్ట్రియల్ ఫోరం ఫర్ మాదిగాస్ (ఇఫ్మార్) అంతర్జాతీయ అధ్యక్షుడు గెద్దం బాపిరాజు పేర్కొన్నారు. గురువారం గవర్నర్‌పేటలోని ఠాగూర్ కె.ఎల్.రావుభవన్‌లో ఇఫ్మార్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అత్యంత వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యం కల్పించేందుకు రిజర్వేషన్లు తెచ్చారని తెలిపారు. ఆగస్టు 1న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా సీఎం చంద్రబాబునాయుడు ప్రభుత్వం తక్షణం జ్యుడీషియల్ కమిషన్ నియమించాలని కోరారు. నాయకులు పి.కృపాకర్ మాదిగ, మట్టా విద్యార్థి, ప్రొఫెసర్లు మత్తయ్య, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు బీబీఏ కృతజ్ఞతలు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : రాజస్థాన్ పర్యటనలో రోడ్డు ప్రమాదానికి గురైన బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చూపిన చొరవపై బీబీఏ కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు బీబీఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగెల శివరామప్రసాద్‌లు ఒక లేఖ రాశారు. ప్రమాదం విషయం తెలియగానే రాజస్థాన్ ముఖ్యమంత్రితో మాట్లాడి, న్యాయవాదులను కాపాడేందుకు తీసుకున్న రక్షణ చర్యలను ఎప్పటికీ మరచిపోలేమని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ ఇతర అధికారులు ఆసుపత్రికి విచ్చేసి చక్కని వైద్యం అందించేందుకు కృషి చేశారని కొనియాడారు.

మహిళల ఆరోగ్యానికి.. ఆయుర్వేదం

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే : ఆయుర్వేద దినోత్సవంలో భాగంగా పాయకాపురంలోని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధనా కేంద్రంలో మహిళల ఆరోగ్యానికి ఆయుర్వేదం అనే కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌సీజీ క్యాన్సర్ సెంటరు ఆధ్వర్యంలో మెడికల్ అంకాలజిస్ట్ ఎ.సత్యశ్రీనివాస్ బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కలిగించారు. మహిళలకు పాప్ స్మియర్, సీఏ 125, పీఎస్‌ఏ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ వృద్ధురాలు (70) మృతి చెందినట్లు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు తెలిపారు. కేదారేశ్వరపేటలో ఒక వృద్ధురాలు అనారోగ్యంతో బాధపడుతోంది. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్చగా.. మెరుగైన చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. మృతురాలు తెలుపు రంగు చీర, ఆకుపచ్చరంగు జాకెట్, తెల్లని జుట్టు ఉందని తెలిపారు. ఆచూకి తెలిసిన వారు తమను సంప్రదించాలని అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కోరారు.

బార్ వద్ద ఘర్షణ

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే : వాంబేకాలనీ రోడ్డులోని ఒక బార్‌లో ఆటోడ్రైవర్ సుబ్బారావు తనపై దాడి చేశారంటూ ఆంజనేయులు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వాంబేకాలనీకి చెందిన ఆంజనేయులు (50) బుధవారం సాయంత్రం బార్ వద్దకు వెళ్లారు. సుబ్బారావుతో గొడవ జరగ్గా.. అతడు తలపై కొట్టాడు. గాయపడిన ఆంజనేయులు ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు కేసు నమోదు చేశారు.

'తల్లి, చెల్లిపై కేసులు వేసిన ఘనత జగన్‌దే'

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : కన్న తల్లి, తోడబుట్టిన చెల్లిపై కేసులు వేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందని తెదేపా రాష్ట్ర కార్యదర్శి గన్నె ప్రసాద్ విమర్శించారు. గురువారం గాంధీనగర్‌లోని ఆయన కార్యాలయంలో ప్రసాద్ విలేకరులతో మాట్లాడారు. వైకాపా హయాంలో మహిళలపై అనేక దాడులు, అత్యాచారాలు జరిగాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.

ఎట్టకేలకు ఆక్రమణల తొలగింపు

పోలీసుల విస్తృత బందోబస్తు

మధురానగర్, న్యూస్‌టుడే

స్పందనకు వందనం

పుష్కరకాలం అక్రమార్కుల చెరలో ఉన్న మధురానగర్ ఏలూరు కాలువ గట్టుకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. ఈ సమస్యపై 'ఈనాడు'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. అధికారులు స్పందించి.. నగరంలో చర్చనీయాంశమైన ఆక్రమణలకు గురువారంతో చెక్ పెట్టారు. తెల్లవారుజామున 3 గంటల నుంచే పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు నడుమ పట్టణ ప్రణాళికాధికారులు, జలవనరులశాఖ అధికారుల పర్యవేక్షణలో ఆక్రమణల తొలగింపు చేపట్టారు. స్థానికులు నిద్రలేచే లోపు దాదాపు మూడో వంతు తీయించేశారు. దాదాపు 50 మంది పోలీసులు, నాలుగు జేసీబీలు, పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో వి.వి.నరసరాజురోడ్డు కిటకిటలాడిపోయింది. పోలీసులు వాహనాల రాకపోకలను పూర్తిగా మూసివేసి, టన్నుల కొద్ది పేరుకుపోయిన ఇనుప తుక్కు, ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలను తీయించారు. వ్యాపారులు అప్పటికప్పుడు వ్యానులు, ఆటోల్లో వచ్చి తుక్కును తరలించుకున్నారు. అధికారులు కాలువగట్టుపై ఉన్న మొత్తం వ్యర్థాలను జేసీబీలతో ఎత్తించేశారు. అక్కడక్కడ పార్కుల పేరిట కొంత ఖాళీస్థలం వదిలేశారని, వాటిని కూడా తొలగిస్తే మేలని స్థానికులు అభిప్రాయపడ్డారు. మరో విగ్రహం పెట్టి అమ్మవారు వెలిసిందని ప్రచారం చేసే వారు ఉన్నారని.. అలాంటి వారికి చెక్ పెట్టాలని విజ్ఞప్తి చేశారు.



ఇనుప తుక్కును వ్యానుల్లో తీసుకుపోతున్న వ్యాపారులు

రక్షణ ఏర్పాట్లుకు శ్రీకారం .. ఖాళీ చేయించిన కాలువగట్టుపై వాహనాలు నిలపకుండా, మళ్లీ ఆక్రమణలు చోటు చేసుకోకుండా.. అంచు వెంబడి గుంతలు తవ్వారు. రక్షణ గోడ లేదా ఇనుప తీగలతో ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తే శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్థానికులు అంటున్నారు. వాకింగ్ ట్రాక్ నిర్మించాలని వారు కోరుతున్నారు. ఎన్ని ఒత్తిళ్లు, ఎంత మంది దాడులు చేసినా.. ఏ మాత్రం జంకకుండా ఆక్రమణలను తొలగించిన అధికారుల పనితీరును ప్రశంసించారు. అందరూ హర్షం వ్యక్తం చేశారు.



బందోబస్తు సిబ్బంది సూచనలిస్తున్న సీఐ శ్రీనివాస్

ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం

కేసు నమోదు చేసిన పోలీసులు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఏలూరు కాలువ గట్టు ఆక్రమణలు తొలగించేందుకు వచ్చిన పట్టణ ప్రణాళికాధికారులపై దౌర్జన్యం చేసి, వారి విధులకు ఆటంకం కలిగించిన వారిపై గుణదల పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ ప్రణాళిక విభాగం టౌన్ ప్లానింగ్ సెక్రటరీ శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. బీఎన్‌ఎస్ 132 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. మధురానగర్‌లో ఏలూరు కాలువ గట్టుపై అధికారులు కొన్ని ఆక్రమణలను తొలగించారు. ఈ క్రమంలో కొందరు స్థానికులు వారిని చుట్టుముట్టేశారు. ఎటూ కదలనీయకుండా చేశారు. ఈ లోగా గుణదల పోలీసులకు సమాచారం తెలియడంతో.. వారు హుటాహుటిన వచ్చారు. అధికారులను స్టేషన్‌కు తీసుకువెళ్లారు. శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

అందరూ స్థానికులే

అధికారులకు విధులకు ఆటంకం కలిగించిన వారంతా స్థానికులేనని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. కొబ్బరితోట, వి.వి.నరసరాజురోడ్డుకు చెందిన వారే ఎక్కువగా ఉన్నారని చెబుతున్నారు. బుధవారం మధ్యాహ్నం వీరంతా రోడ్డుపై బైఠాయించారు. గురువారం పెద్ద ఎత్తున పోలీసులు రావడంతో.. వారంతా కనిపించకుండా పోయారు. బుధవారం తొలగింపునకు వచ్చిన ఒక ఉద్యోగిపై.. ఒక వ్యక్తి కత్తితో దాడి చేసేందుకు వచ్చాడని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. అతను ఎవరూ అనేది తెలియరాలేదు. ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగిస్తే తీవ్రమైన నేరంగా పరిగణిస్తారు. నేరపూరితంగా బల ప్రయోగం చేసినా.. తీవ్రమైన చర్యలు తప్పవు. మధురానగర్‌లో ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించిన వారిపై బి.ఎన్.ఎస్. 132 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. ఈ సెక్షన్ కింద నేరం రుజువైతే రెండేళ్ల వరకు జైలుశిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంది.

సైబర్ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న బాలరాజాజీ

సత్యనారాయణపురం, న్యూస్‌టుడే : ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలు, వాటిబారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సత్యనారాయణపురం సీఐ బాలరాజాజీ అవగాహన కల్పించారు. గురువారం సీతన్నపేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అపరిచిత నంబర్ల నుంచి ఫోన్లు వస్తే. . మాట్లాడవద్దన్నారు. ఎలాంటి సమాచారం తెలియని వారెవరికీ ఇవ్వరాదని సూచించారు. ప్రధానంగా బ్యాంకుల నుంచి చేస్తున్నట్లు వచ్చిన ఫోన్లపై మరింత అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఒకసారి ఆర్థికంగా నష్టపోతే.. తిరిగి రాబట్టడం చాలా కష్టమని చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ.. ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి అనుమానాలున్నా వెంటనే పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు షబ్బీర్ అహ్మద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తోపుడు బండి బహూకరణ



ఆజాద్ ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో న్యూరాజరాజేశ్వరీపేటకు చెందిన షేక్ కరీమా అనే పేద మహిళకు చిరు వ్యాపారం నిమిత్తం తోపుడు బండి అందించారు. కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా చేతుల మీదుగా గురువారం దీనిని అందించారు. ఆయన మాట్లాడుతూ.. పేద ముస్లింలకు సేవ చేయాలన్న లక్ష్యంతో ప్రతి నెలా సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. షేక్ సాజిద్‌ఆలీ, ఎం.డి.కాలేషా, సయ్యద్ మౌలాలి, షేక్ మస్తాన్, షేక్ రజియా తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్)

వరద బాధితులకు వితరణ

గాంధీనగర్, న్యూస్‌టుడే : ఇటీవల వరదల వల్ల నష్టపోయిన బాధితులకు రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ సెంట్రల్ సభ్యులు గురువారం హనుమంతరాయ గ్రంథాలయం వద్ద దుప్పట్లు, టవళ్లు, టీషర్టులు, లుంగీలు, భోజనం పళ్లాలు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు జి.ఎల్.పద్మాదాస్, కార్యదర్శి వి.కిషోర్, పరుచూరి నరసింహారావు, అజయ్‌కుమార్, మన్వర్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



అధికారులతో చర్చిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని ప్రధానమైన కూడలి ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు అన్ని చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పోలీసు అధికారులకు సూచించారు. ట్రాఫిక్ పోలీసు అధికారులతో నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆయన గురువారం ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల శ్రేయస్సు, ఇతర సమస్యల పరిష్కారానికి నగరపాలక సంస్థ పోలీసు అధికారులకు అవసరమైన సహకారం అందిస్తుందని వెల్లడించారు. పలు ప్రాంతాలు, కూడళ్లలోని ట్రాఫిక్ ఇబ్బందులను ట్రాఫిక్ పోలీసులు కమిషనర్ దృష్టికి తేగా.. వాటి పరిష్కారానికి అనువైన చర్యలకు సహకారం ఉంటుందని తెలిపారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శనలు



'చింతామణి'లోని ఓ ఘట్టంలో త్రినాథ్‌నాయుడు, లక్ష్మీశ్రీ

గాంధీనగర్, న్యూస్‌టుడే : సాయి హృదయ కళా నాట్య మండలి, గుమ్మడి జయరాజు కళాపీఠం, మంగమ్మ తల్లి కళా నాట్య మండలి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం హనుమంతరాయ గ్రంథాలయంలో ప్రదర్శించిన నాటక ప్రదర్శనలు శ్రోతలను ఆకట్టుకున్నాయి. చింతామణి నాటకంలో అగురు త్రినాథ్‌నాయుడు, లక్ష్మీశ్రీ, సత్య హరిశ్చంద్ర నాటకంలో బి.బూసిరెడ్డి, అప్పలస్వామి, వడ్డిపల్లి పోలినాయుడు, దర్శి శ్రీనివాస్, ఎం.ఎస్.నాయుడు, చిరంజీవి వారి వారి పాత్రల్లో నటించి ప్రేక్షకుల మన్ననలు పొందారు. బొత్స సూర్యనారాయణ, డోలక్ రామకృష్ణ, ఏసయ్య సంగీతం అందించారు. గుమ్మడి జీవన్‌కుమార్, మోడి ఆంజనేయులు, నిమ్మగడ్డ ఏసుపాదం, బత్తుల నాగేశ్వరరావు, కొప్పుశెట్టి నాగభూషణం, అక్కిశెట్టి నారాయణరావు, బాబూరావు, మోటూరి ఆంటోని, గుమ్మడి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.